

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ది తెలుగు దినపత్రిక

అవినీతి అంతం – మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 278 సోమవారం, అక్టోబర్ 26 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

నర్సింగ్ కాలేజీలో వసూళ్ల దందా?

■ చదువుకోడానికి వచ్చిన విద్యార్థులపై ఫీజుల భారం..

■ భోజన నాణ్యతపైనా ఫిర్యాదులు



కరీంనగర్ జోర్దార్ నిఘా విభాగం

ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో విద్యార్థుల నుంచి వివిధ పేర్లతో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన విద్యాసంస్థలో.. విద్యార్థుల నుంచి నెలవారీ మెస్ ఫీజుతో పాటు పలు రకాల చెల్లింపులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వసూళ్లకు సంబంధించి స్పష్టమైన లెక్కలు, రశీదులు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి.విద్యార్థుల నుంచి నెలకు సుమారు రూ.3,100 వరకు మెస్ ఫీజు పేరుతో తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనికి అదనంగా పాలు తాగేందుకు రూ.200, హాస్టల్ నిర్వహణ పేరుతో రూ.250, బస్సు ఛార్జీలుగా మరికొంత మొత్తం వసూలు చేస్తున్నారని విద్యార్థుల వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ మొత్తాలను ఏ నిబంధనల ప్రకారం వసూలు చేస్తున్నారో స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.మరోవైపు చెల్లింపుల విషయంలోనూ పారదర్శకత లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా చెల్లించే అవకాశం కల్పించకుండా నగదు రూపంలోనే డబ్బులు ఇవ్వాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతి చెల్లింపునకు రశీదు ఇవ్వడంతోపాటు వసూలు చేసిన మొత్తాలకు పూర్తి వివరాలు వెల్లడించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతపైనా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. భోజనం రుచిగా ఉండడం లేదని, నాణ్యత విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో సిబ్బందికి మాత్రం ప్రత్యేకంగా భోజనం సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని అధికారులు స్వయంగా పరిశీలించి నాణ్యతను నిర్ధారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.నర్సింగ్ విద్యార్థుల నుంచి వర్క్ టూర్ పేరుతో కూడా అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల విద్యలో భాగంగా నిర్వహించే పర్యటనలకు ఎంత మొత్తం వసూలు చేస్తున్నారు, ఆ మొత్తాన్ని ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు అనే వివరాలను బహిర్గతం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.కాలేజీలో జరుగుతున్న వ్యవహారాలపై విద్యార్థులు ప్రశ్నిస్తే వారిపై ఒత్తిడి, వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అలాగే అనుభవం లేని సిబ్బందితో విద్యార్థులకు బోధన కొనసాగిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బంది కలగకుండా అర్హత, అనుభవం ఉన్న సిబ్బందితోనే బోధన కొనసాగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.ప్రభుత్వ విద్యాసంస్థలో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ప్రతి రూపాయికి లెక్క ఉండాల్సిందేనని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. మెస్ ఫీజులు, హాస్టల్ నిర్వహణ, బస్సు ఛార్జీలు, వర్క్ టూర్ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మాయమైపోతున్న మానవ సంబంధాలు

■ తప్పుడు డిక్లరేషన్ తో ఆస్తిని కాజేసిన జ్యేష్ఠ కుమారుడు

■ తప్పుచేసి ఇరుక్కుపోయిన ఎల్కతుర్తి తాసిల్దార్ కార్యాలయం



హనుమకొండ జోర్దార్ ప్రతినిధి

నేటి సమాజంలో మానవ సంబంధాలు మంట కలుస్తున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయ అనురాగాలు వెల్లి విరియాల్సిన చోట ఆస్తుల కోసం తప్పుడు మార్గాలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రుల పోషణ భారాన్ని మరిచి వారి మరణానంతరం ఆస్తుల కోసం ఆరాటపడుతున్నారు. తప్పుడు పద్ధతులు అవలంబిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆస్తుల పంపకాల్లో అనుబంధాలు మరిచి మనుషులు ఎంతకైనా తెగిస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతూ, వారసత్వంగా న్యాయబద్ధంగా లభించాల్సిన వాటాకు మించి ఆస్తులు పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఆమ్యామ్యాలకు ఆశపడిన అధికార యంత్రాంగం అడ్డదారిలో వారికి సహకరిస్తున్నారు.జోర్దార్ దినపత్రికకు ఆలస్యంగా అందిన ఒక అమానవీయ సంఘటనకు సంబంధించిన వివరాలను మీకు అందిస్తున్నాం. మాయమైపోతున్న కుటుంబ విలువలు, అవినీతి రెవెన్యూ యంత్రాంగం లీలలు ఈ వార్తలో ఇమిడి ఉన్నాయి.తల్లి బ్రతికి ఉండగా పోషణ బాధ్యత మరిచిన ఓ జ్యేష్ఠ కుమారుడు ఆమె మరణానంతరం వారసత్వంగా వచ్చే ఆస్తిని అడ్డదారిలో కాజేయాలనుకున్నాడు. ఆమ్యామ్యాలతో రెవిన్యూ యంత్రాంగాన్ని లోభరచుకొని అక్రమంగా ఆస్తిని కొట్టేసి అడ్డంగా దొరికిపోయాడు. కళ్ళు మూసుకొని వారసత్వ భూమిని పట్టా చేసిన ఎల్కతుర్తి రెవెన్యూ యంత్రాంగం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అరకొరగా దిద్దుబాటు చర్యలు ప్రారంభించినా బాధితులకు మాత్రం ఇప్పటివరకు సంపూర్ణ న్యాయం జరగలేదు.

వివరాల్లోకి వెళితే....

ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన పండుగ వీరస్వామి – కొమురమ్మ దంపతులకు 3 కుమారులు, 4 కుమార్తెలు. మొత్తం ఏడుగురు సంతానం. ఈ కుటుంబానికి గ్రామంలో వివిధ సర్వే నంబర్ల కింద సుమారు 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మార్చి 2016లో వీరస్వామి మరణించారు. ఆయన మరణానంతరం తల్లి కొమురమ్మ పోషణకు బాధ్యత వహించాల్సిన పెద్ద కుమారుడు పండుగ వెంకటేశ్వర్లు మొహం చాటేసాడు. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పని చేస్తూ ఆర్థికంగా స్థోమత కలిగి ఉన్నప్పటికీ ఆయన ఏనాడు తల్లి గురించి పట్టించుకోలేదని, ఆమె పోషణ బాధ్యతను విస్మరించారని మిగతా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. జ్యేష్ఠ కుమారుడి నిరాకరణతో కొమురమ్మ మరొక కుమారుడు పండుగ చంద్రశేఖర్ తల్లి సంరక్షణ, పోషణ బాధ్యతలు చేపట్టారు. చంద్రశేఖర్ వద్ద ఆశ్రయం పొందిన కొమరమ్మ దురదృష్టవశాత్తు కరోనా కారణంగా మార్చి 2021 లో కాలధర్మం చెందారు. తల్లిదండ్రుల మరణానంతరం ఆస్తుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. కుటుంబ సభ్యుల పరస్పర ఆమోదం, అంగీకారంతో జరగాల్సిన భాగ పంపకాలు జ్యేష్ఠ కుమారుడు వెంకటేశ్వర్లు కుట్ర కారణంగా వక్రమార్గం పట్టింది. తల్లి పోషణ బాధ్యతలు మరిచి కుటుంబంలో మొహం చెల్లని వెంకటేశ్వర్లు రెవెన్యూ యంత్రాంగం సహకారంతో ఆస్తిని కొట్టేయాలని ప్రయత్నించారు. కుటుంబ సభ్యులు ఎవరికీ తెలుపకుండా తప్పుడు అఫిడవిట్ పత్రాన్ని సృష్టించాడు. దివంగత కొమురమ్మకు తాను ఒక్కడినే కుమారుడిని అని పేర్కొంటూ తప్పుడు అఫిడవిట్ సృష్టించి, వారసత్వంగా ఆస్తిలో తనకు వాటా లభించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆశ్రయించాడు. ఆమ్యామ్యాలతో ఎల్కతుర్తి రెవెన్యూ యంత్రాంగాన్ని లోబర్చుకొని ఆస్తిలో వాటాను కొట్టేశాడు.

(ఎల్కతుర్తి తాసిల్దార్ కార్యాలయం మాయాజాలం..... ఎఫ్ఐఆర్ నమోదు ..తదుపరి సంచికలో)

ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ వ్యాపారం! గౌరెడ్డిపేట బడిలో

ఉపాధ్యాయుడి దందా?

- జీతం ప్రభుత్వానిది.. సేవ గొలుసుకట్టు కంపెనీకి...

- నాలుగు చక్రాల కానుక కోసం బడిని పణంగా పెట్టిన ఉపాధ్యాయుడు



పెద్దపల్లి.జోర్దార్ ప్రతినిధి

1. బడిలో గురువు లేడు – వ్యాపారం జోరుగా ఉంది:

పిల్లలకు అక్షరాలు నేర్పి భవిష్యత్తు తీర్చిదిద్దాల్సిన గురువే దారి తప్పితే ఏమవుతుంది అనడానికి పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట పాఠశాలే నిదర్శనంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటూ సేవ మాత్రం విస్టేజ్ అనే గొలుసుకట్టు వ్యాపార సంస్థకు చేస్తున్నాడనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

2. పాఠం పక్కన – సొమ్ము లెక్కలే ముందు:

సదరు ఉపాధ్యాయుడు బోధనను పూర్తిగా పక్కనబెట్టి రోజంతా గొలుసుకట్టు వ్యాపార ప్రచారాలు, సమావేశాల్లో బిజీగా తిరుగుతున్నాడు. కింది స్థాయిలో సభ్యులను పెద్ద ఎత్తున చేర్పించడం ద్వారా భారీగా సొమ్ము సంపాదించడమే కాకుండా, ఇటీవల ఒక ఖరీదైన నాలుగు చక్రాల వాహనాన్ని కానుకగా పొందినట్లు స్థానికంగా జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో బడి గంటల సమయంలో కూడా బడిలో కాకుండా వ్యాపార పనుల్లోనే కనిపిస్తున్నాడని తల్లిదండ్రులు చెబుతున్నారు.

3. తనతో పాటు తోటి గురువులను కూడా ఊబిలోకి:

ఈ వ్యాపార దాహం తనతో ఆగలేదు. తనతో పాటు పనిచేసే తోటి ఉపాధ్యాయులకు, సిబ్బందికి పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని ఆశ చూపి ఈ గొలుసుకట్టు ఊబిలోకి దించుతున్నాడు. పాఠశాల సమయంలో పిల్లల చదువుల గురించి చర్చించాల్సింది పోయి, ఉత్పత్తులు, వాటాలు, వాహన నిధుల గురించే గుంపులుగా చేరి మాట్లాడుకోవడం పరిపాటిగా మారిందని, దీంతో విద్యా ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

4. తెలిసినా పట్టించుకోని విద్యాశాఖ – అధికారుల తీరుపై అనుమానాలు:

ప్రభుత్వ నియమాల ప్రకారం జీతం తీసుకునే ఉపాధ్యాయుడు ప్రైవేటు వ్యాపారం చేయడం నేరమని తెలిసినా, ఈ వ్యవహారం విద్యాశాఖ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వదిలేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ గొలుసుకట్టు వ్యాపారంలో అధికారులకు కూడా వాటా ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

5. జిల్లా పాలనాధికారి కళ్ళు తెరవాలి – తల్లిదండ్రుల వేడుకోలు:

గ్రామీణ పేద పిల్లల చదువులు అంధకారంలోకి జారుతున్నా విద్యాశాఖ పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి గారు కళ్ళు తెరిచి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, నిబంధనలు తప్పి బడిని పణంగా పెడుతున్న ఉపాధ్యాయుడిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ బడుల్లో చదువులను కాపాడాలని పెద్దపల్లి ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఎల్‌నినో ప్రభావంతో ఎండలు 50 డిగ్రీలకు చేరే అవకాశం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబరు 25 :

తాగునీటి కష్టాలు తలెత్తకుండా తమ ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. (ఆదివారం) దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పనులను మంత్రి తుమ్మల పరిశీలించారు. కుమ్మరి గూడెం వైపు ఒడ్డు నుంచి దుమ్ముగూడెం అవతల ఒడ్డుకు బోటులో చేరుకున్నారు. ఆనకట్టపైన ఒక మీటర్ ఎత్తున ఏర్పాటు చేస్తున్న ఇసుక బస్తాల పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. సూపర్ ఎల్‌నినో ప్రపంచానికి విపత్తులా మారిందని వెల్లడించారు.

గోదావరి నీటిని నిల్వచేస్తున్నాం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి గండం లేకుండా గోదావరి నీటిని నిల్వచేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. దుమ్ముగూడెం ఆనకట్టపై మీటర్ ఎత్తున నీరు నిలిచేలా ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక టీఎంసీ నీళ్లు నిల్వ చేసేలా పనులు సాగుతున్నాయని అన్నారు. ఎగువ నుంచి వరద ఉధృతి ఉన్నా ఇసుక బస్తాలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వ కోసం చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపామని అన్నారు. తక్షణమే ఆయా పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.

ప్రజలు అసాధారణ పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలి..

ఎల్‌నినో ప్రభావంతో 0.5 డిగ్రీలు పెరిగితేనే ఎండలు భగ్గుమంటున్నాయని మంత్రి తుమ్మల చెప్పారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా వేసిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఎండలు 50 డిగ్రీలు చేరే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు అసాధారణ పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

పట్టభద్రుల చూపు కాంగ్రెస్ వైపే!

పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు



న్యూ శాయంపేట, అక్టోబర్ 25

పట్టభద్రుల ఆదరణ కాంగ్రెస్ వైపే ఉందని పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు 31వ డివిజన్‌లో నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, మార్క విజయ్, సత్తు రమేష్, సురేందర్, ముప్ప వేణు, మామిండ్ల సురేష్, పిండి రమేష్, కనుకుంట్ల కృష్ణ, మంద సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో 12 కిలోల గంజాయి పట్టివేత

- రూ.6 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం
- మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ అరెస్ట్
- మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం.. కేసు నమోదు చేసి దర్యాప్తు



నెక్కొండ, అక్టోబర్ 25

వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో భారీగా ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నెక్కొండ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ నితిన్ న్యాను షిండేను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 12 కిలోల ఎండు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని ఎస్సై శ్రావణ్ కుమార్ వెల్లడించారు.ఎస్సై శ్రావణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి నెక్కొండ మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను గమనించిన అతడు పారిపోయేందుకు ప్రయత్నించగా సిబ్బంది అప్రమత్తమై పట్టుకున్నారు.



తనిఖీల్లో అతడి వద్ద ఎండు గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ నితిన్ న్యాను షిండేగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులు, సరఫరా నెట్‌వర్క్‌తో పాటు ఇతరుల ప్రమేయంపై విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



వరంగల్, అక్టోబర్ 25

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులైన బాధితులకు రూ.1.5 లక్షల వరకు, గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత చికిత్స అందుతుందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 112కు సమాచారం అందించి, క్షతగాత్రులను సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.

మాజీ మంత్రి కొండా సురేఖ ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో భేటీ



నేడు ఏఐసీసీ కార్యదర్శి,

వరంగల్ శ్రీ సచిన్ సావంత్ గారిని మాజీ మంత్రివర్యులు, వరంగల్ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి కొండా సురేఖ గారు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సాగిన ఈ భేటీలో అనేక కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేయడం, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో సహా అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.అలాగే రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, వరంగల్ జిల్లా రాజకీయ పరిస్థితులు, రాబోయే గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మరింత దగ్గర చేయాలని సావంత్ గారు సూచించగా, తప్పకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కొండా సురేఖ గారు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యానికి విద్యార్థినులే బలికావాలా?



- మూడేళ్లుగా తిమ్మాపూర్‌లోనే గన్నేరువరం కేజీబీవీ.. కనీస వసతులపై ఆందోళన
- 300 మందికి తొమ్మిది మరుగుదొడ్లేనా? పాఠశాలను సొంత మండలానికి తరలించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి:,)

గ్రామీణ ప్రాంత బాలికలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భద్రతకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గన్నేరువరం మండలానికి మంజూరైన కేజీబీవీని గత మూడేళ్లుగా తిమ్మాపూర్‌లోనే కొనసాగిస్తుండటం తో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను గన్నేరువరానికి తరలించడంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు.

మూడు వందల మందికి పరిమిత వసతులు

తిమ్మాపూర్‌లో కొనసాగుతున్న పాఠశాలల్లో గన్నేరువరం, తిమ్మాపూర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు కలిపి 300 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. ఇంతమంది విద్యార్థినులకు కేవలం తొమ్మిది మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, దీంతో ఉదయం వేళ కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానాలు చేయడానికి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని ఆరోపణలు ఉన్నాయి. తెల్లవారుజామునే నిద్రలేచి తమ పనులు పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థినుల ఇబ్బందులను తల్లిదండ్రులు వివరిస్తున్నారు.

మంజూరైనా సొంత మండలంలో ప్రారంభం కాని పాఠశాల

కరీంనగర్ జిల్లాకు మూడేళ్ల క్రితం అదనంగా రెండు కేజీబీవీలు మంజూరయ్యాయని, వాటిలో కొత్తపల్లి పాఠశాల ఎలగందల్ మోడల్ స్కూల్‌లో కొనసాగుతుండగా, గన్నేరువరం పాఠశాల మాత్రం తిమ్మాపూర్‌లోనే కొనసాగుతోందని పేర్కొంటున్నారు. గన్నేరువరం పెద్ద మండలం అయినప్పటికీ అక్కడ ఉన్నత పాఠశాలలు రెండే ఉండటంతో దూర ప్రాంతాల విద్యార్థినులు చదువు కోసం ప్రయాణ భారం భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. దూరం వెళ్లలేని కొందరు మధ్యలోనే చదువు మానేస్తున్నారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం ఏదీ?

పాఠశాలను గన్నేరువరానికి తరలించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థినులకు అవసరమైన వసతుల కల్పనపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. రెండు పాఠశాలలను వేర్వేరుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

కొత్తగా బాధ్యతలు చేపట్టే అధికారులైనా స్పందించాలి

జిల్లా బాలికా విద్యాభివృద్ధి పర్యవేక్షణాధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ ఈ సమస్యను పరిశీలించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థినుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని గన్నేరువరం కేజీబీవీని అదే మండలానికి తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. బాలికల విద్య, భద్రత, కనీస వసతులు ప్రాధాన్యంగా ఉండాలని, పరిపాలనా సౌలభ్యం పేరుతో విద్యార్థినుల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని వారు పేర్కొంటున్నారు.విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించి, పాఠశాలను సొంత మండలంలో ప్రారంభించే విషయంలో అధికారులు ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

కాంగ్రెస్‌కు భార్గవ్ దేశ్‌పాండే గుడ్‌బై

బీఆర్ఎస్‌లో చేరిక



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పార్టీ ఇన్‌చార్జీలు బాల్క సుమన్, జాన్సన్ నాయక్ పాల్గొన్నారు.కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు,గౌరవం లభించకపోవడంతోనే పార్టీని వీడినట్లు భార్గవ్ పేర్కొన్నారు.

గతంలో ఎన్ఎస్‌యూఐ,యూత్ కాంగ్రెస్,ఏఐసీసీలో వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయన 2014లో ఆదిలాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని ప్రకటించిన భార్గవ్, నవంబర్ 1న ఆదిలాబాద్ డైట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కేటీఆర్‌ను ఆహ్వానించనున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు

నమోదుపై అవగాహన



వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి)పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు, ఇతర పట్టభద్రులైన పరిచయస్తులతో ఓటు నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాగేందర్ గౌడ్, ప్రైవేటు పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, పలు పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడితో బాసర ట్రిపుల్ ఐటీలో

ఆన్‌లైన్ తరగతులు



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో నీటి ఎద్దడి కారణంగా దసరా సెలవులను పొడిగించడంతోపాటు, అక్టోబర్ 26 నుంచి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది.

నవంబర్ 17లోగా సిలబస్ పూర్తి చేయాలని సవరించిన అకడమిక్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. క్యాంపస్‌లో సుమారు 9 వేల మంది విద్యార్థులకు రోజుకు 25 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా, ప్రస్తుతం 15 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా అవుతోంది. గోదావరి పంప్‌హౌస్‌లో మోటార్లు పనిచేయకపోవడం, నిల్వలు తగ్గడంతో నీటి సమస్య తీవ్రంగా మారింది.

ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పంప్‌హౌస్‌ను సందర్శించి, మోటార్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన

రేణి కుంట్ల ప్రవీణ్



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని కాసిపేట మండల పెద్దనపల్లి సర్పంచ్ కలువల శరత్ తండ్రి కలవల లక్ష్మణ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, మంచిర్యాల జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, రాష్ట్ర మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, రేణి కుంట్ల ప్రవీణ్, వారి కుటుంబ సభ్యులను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం మామిడిగూడెంకు చెందిన బానోత్ తిరుపతి తల్లి బానోత్ ముత్తమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపి, సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ రాజ్ కుమార్, అశోక్ , బైరి శంకర్, లంక లక్ష్మణ్, ఇరుగురాల రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డి.ఎస్.సి 2024 ఉపాధ్యాయులకు

2వ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి



● టి.ఎస్.యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్ కుమార్

హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా నేడు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ పక్షాన మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని డి.ఇ.ఒ ప్రశాంత్ రెడ్డి సూచించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

అనంతరం టి.ఎస్.యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి టి.ఎస్.యు.టి.ఎఫ్ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. డి.ఎస్.సి 2024 ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి 2వ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టి.ఎస్.యు.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద రావు, ఉపాధ్యక్షులు నామోజు శ్రీనివాస్, కోశాధికారి ఎస్.ఎ. రవూఫ్, జిల్లా కార్యదర్శులు డి. సమ్మక్క, కె. రమేష్, పాక శ్రీనివాస్, కె. రవీందర్, గుండు కరుణాకర్, కేజీబీవి కన్వీనర్ టి.రేణుక, మోడల్ స్కూల్స్ కన్వీనర్ కె. నీలాద్రి మండలాల బాధ్యులు, పి.శివ ప్రసాద్, బి. మల్సూర్, వి. సంపత్, రాజి రెడ్డి, జోగయ్య, నర్సింహ రావు, నాగబెల్లి కుమారస్వామి, అర్జున్ సాగర్, టి.అనిత, అరవింద్, పొన్న రవి, గుమ్మడి రాజు, టి. కిషోర్, వీరస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించే

వరకు పోరాటం ఆగదు



● ఎన్‌హెచ్‌ఎం

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఆదివారం 13వ రోజు నిరసన కొనసాగించారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మౌన పోరాటం నిర్వహించారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత, క్యాడర్ ఫిక్సేషన్, వేతన సవరణ, పెండింగ్ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ పోరాటం శాంతియుతమని, హక్కులు సాధించే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న

దళితులకు యజమాన్య హక్కులు కల్పించాలి



● మాదిగ హక్కుల దండోరా నాయకుల డిమాండ్.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న దళితులకు యాజమాన్య హక్కులు కల్పించాలని, మాదిగ హక్కుల దండోరా నాయకులు డిమాండ్ చేశారు.

శనివారం సాయంత్రం బెల్లంపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో, దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు మాదిగ, అధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టో లో ప్రకటించిన విధంగా, దళితులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు యాజమాన్యపు (పట్టాలు) హక్కులు ఇవ్వాలని,

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫాస్టోలో ప్రకటించి,

అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడిచిన దళితుల సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు ఇప్పటి వరకు యజమాన్యపు హక్కులు కల్పించలేదని,వెంటనే అసైన్డ్ భూముల లబ్ధిదారులకు యజమాన్యపు హక్కులు కల్పించాలనీ డిమాండ్ చేశారు.

"ఎల్ ని నో "సాకుతో బియ్యం అధిక ధరలతో

కృత్రిమ కొరత సృష్టిస్తున్న బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



● రైస్ మిల్లు వ్యాపారులపై టాస్క్ ఫోర్స్, పౌరసరపరాల, అధికారులు చర్యలు తీసుకోవాలి.

● పసులేటి వెంకటేష్ డిమాండ్.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:ఎల్ నినో సాక్ తో పేద ప్రజలు ఆహారంగా వినియోగించే బియ్యాన్ని కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై, రైస్ మిల్లులపై, టాస్క్ ఫోర్స్, పౌరసరఫల అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని, ఎం సి పిఐ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు.

ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఎల్ నినో వాతావరణ పరిస్థితులను సాకుగా చూపిస్తూ, సాధారణ ప్రజల ప్రధాన ఆహారమైన బియ్యం ధరలను అడ్డగోలుగా పెంచి విక్రయించడాన్ని ఎం సి పి ఐ యు పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందనీ, ప్రకృతి వైపరీత్యాన్ని సాకుగా మార్చుకొని కొంతమంది స్వార్థపర వ్యాపారులు బియ్యం నిల్వలను అక్రమంగా దాచి, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సాధారణ మధ్యతరగతి, పేద ప్రజలు కొనుగోలు చేసే సన్నబియ్యం ధరలను సైతం కిలోకు 60 రూపాయల నుండి 95 రూపాయలకు పెంచి సామాన్యుడి రక్తాన్ని పిండుతున్నారని, ఎల్ ని నో వల్ల దిగుబడి తగ్గిన మాట వాస్తవమే అయినప్పటికీ దానిని ఆసరాగా చేసుకొని బ్లాక్ మార్కెట్ కేటు గాళ్లు చేస్తున్న దోపిడీకి హద్దు అదుపు లేకుండా పోయిందని అన్నారు.

అధికారులు తక్షణమే స్పందించి బియ్యం హోల్సేల్ వ్యాపార కేంద్రాలు, మిల్లులపై టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిల్వలను బయటకు తీసి నియంత్రిత ధరకు బియ్యం లభించేలా చూడాలని, లేని పక్షంలో ఎం సి పి ఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తోగరి రాహుల్, ఆరేపల్లి రమేష్, సంబోధి రాజేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ రైతు గర్జన

● కేటీఆర్ హాజరు

● రైతులుతరలిరావాలి

● జోగు రామన్న



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నవంబర్ 1న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డ్రైట్ మైదానంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు గర్జన నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని వెల్లడించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులతో కలిసి కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు.ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని జోగు రామన్న విమర్శించారు. రైతులు పంటలు వేయొద్దని సూచించడం వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తుందని ఆరోపించారు. రైతులకు సాగునీరు అందుబాటులో ఉన్నప్పుడు పంటల సాగును ప్రోత్సహించాలని, నష్టపోతున్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని పేర్కొంటూ, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రైతు గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో పార్టీ నాయకులు లింగారెడ్డి, అజయ్, వేణుగంటి ప్రకాష్, మామిడాల దశరథ్, గంద్ర రమేష్, గోవర్ధన్, యాసం నర్సింగరావు, మెట్టుప్రసాద్, యూసీస్ అక్బానీ, సాజిద్‌ద్దీన్, చందాల రాజన్న, దాసరి రమేష్, విజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగు రామన్నను 50 వేల ఓట్ల

మెజార్టీతో గెలిపిస్తాం



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి జోగు రామన్నను 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామని యువ నాయకుడు భార్గవ్ దేశ్‌పాండే ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా, కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.అనంతరం ఆదిలాబాద్‌లో జోగు రామన్న సమక్షంలో నిర్వహించిన సమావేశంలో భార్గవ్ దేశ్‌పాండే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, జోగు రామన్న నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

వీణవంక ఎంఈఓ సుద్దాల శోభారాణికి

జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డు

● న్యూఢిల్లీలో స్కూల్ లీడర్‌షిప్ సమిట్ అవార్డుతో ఘన సత్కారం



(వీణవంక జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండల విద్యాధికారిణి సుద్దాల శోభారాణి జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందారు. న్యూఢిల్లీలో నిర్వహించిన ఇండియా స్కూల్ లీడర్‌షిప్ సమిట్ అవార్డ్స్--2026 కార్యక్రమంలో ఆమెకు ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు.

న్యూఢిల్లీలోని లోధీ రోడ్డులో ఉన్న ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లోని సీడీ దేశ్‌ముఖ్ ఆడిటోరియంలో వరల్డ్ అలయన్స్ ఆఫ్ స్కూల్ ప్రిన్సిపల్స్ (డబ్ల్యూఏఎస్‌పీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

అమెరికాకు చెందిన ప్రముఖ ఆవిష్కర్త డాక్టర్ రిసానా వర్జీనియా, నేపాల్‌కు చెందిన డాక్టర్ రవి స్వామి, ఐఐటీ ప్రొఫెసర్ నీల్ కుమార్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

విద్యారంగంలో విశేష గుర్తింపు పొందిన సందర్భంగా సుద్దాల శోభారాణిని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు అభినందించారు. ఈ అవార్డు వీణవంక మండల విద్యారంగానికి గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

గిరిజన భాషల పరిరక్షణకు
ప్రత్యేక ప్రణాళిక అవసరం



● కోయ గోండి భాషకు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలి

● మడివి నెహ్రూ

ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో, చింతూరు:గిరిజన భాషల అభివృద్ధి కంటే ముందుగా వాటి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోయ భాషా బృందం నాయకుడు మడివి నెహ్రూ అన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 23, 24 తేదీల్లో నిర్వహించిన "గిరిజన భాషలు--భారతీయ భాషలే" జాతీయ సదస్సులో భద్రాచలం, చింతూరు ప్రాంతాలకు చెందిన కోయ భాషా బృందం పాల్గొంది.
పిల్లలకు ఇంట్లోనే మాతృభాష నేర్పించాలని, కుటుంబ సభ్యులు, సామాజిక కార్యక్రమాల్లో కోయ భాషను విస్తృతంగా ఉపయోగించాలని నెహ్రూ పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం--2020 ప్రకారం మాతృభాష ఆధారిత ప్రాథమిక విద్యను పునరుద్ధరించాలని కోరారు. గిరిజన భాషల మౌఖిక సాహిత్యాన్ని సేకరించి, రికార్డు చేసి గ్రంథస్థం చేయాలని సూచించారు.
కోయ గోండి భాషకు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కుంజాం నాగేశ్వరరావు, మడివి మీనాక్షి, వేట్ల నీలిమ, బీరబోయిన జంపన్న, గొంది శైలజ, సారపు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం జెడ్పీటీసీ అభ్యర్థిగా
పొడియం అప్పారావు

● టీడీపీ శ్రేణుల తీర్మానం

ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో, చింతూరు:కూనవరం జెడ్పీటీసీ అభ్యర్థిగా పొడియం అప్పారావును బరిలోకి దింపాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానించారు. పోలవరం జిల్లా కూనవరం మండలం కోతులగుట్టలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.
పార్టీ అధిష్ఠానం బీఫామ్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అప్పారావును గెలిపించుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. ఈ స్థానాన్ని ఇతర పార్టీలకు కేటాయిస్తే అంగీకరించబోమని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి



భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు గడేసుల ప్రేమ్ చందు, చెలికాని ఉమ, మడకం చిన్ని, ముప్పె నబోయిన నాగరాజు, కరక సర్వేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు
సమష్టిగా కృషి చేయాలి



ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో, చింతూరు:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. కూనవరం మండలం పెద్దార్కూరులో మండల అధ్యక్షుడు కరక పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.
ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి సోముల సత్యనారాయణను పరిచయం చేశారు. జెడ్పీటీసీ అభ్యర్థి పాయం వెంకయ్యతోపాటు బీజేపీ నాయకులు కుంజా చంద్రయ్య, సోయం సుధారాణి, తుర్రం అశోక్‌కుమార్, పాయం వెంకన్నబాబు, చిచ్చడి నారాయణ, చిచ్చటి ప్రసాద్, మడకం కన్నయ్య, బీవీఎస్ నారాయణ, పూనం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతికి
ఎమ్మెల్యే విజయుడికి ఆహ్వానం



జోగుళాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి): వడ్డేపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన వాల్మీకి సోదరులు, నాయకులు, కార్యకర్తలు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడిని మర్యాదపూర్వకంగా కలిసి, అక్టోబర్ 26న నిర్వహించనున్న మహర్షి వాల్మీకి జయంతి వేడుకలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని అందజేసి, వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బతుకు సాక్ష్యం



చెదిరిన గుండెల నుండి.....
చైతన్య జ్వాలల దాకా.....

చెదిరిన గుండెలకు
స్వాంతన ఎవరు?
విసిగిన జీవితాలకు
విశ్రాంతి ఎక్కడ?

నెత్తురు కక్కుకుంటూ
నేలరాలే నరమేధానికి
అంతం లేదా?
కరుణ కోసం కళ్ళు వెతుకుతుంటే
కదలని హృదయాలకు
మనిషితనం ఎక్కడ?

హృదయ జ్వాలలు
చల్లార్చేది ఎవరు?
కన్నీటి చుక్కల వెనుక
కనిపించని కడగండ్లను
చదివేది ఎవరు?

వ్యసనానికి బానిసైతే
లోకం పరిహసిస్తుంది...
కానీ.....
ఆ వ్యసనం వెనుక
ఒంటరితనం ఉందా?
ఆకలి ఉందా?
అణచివేత ఉందా?
అని అడిగే మనసెక్కడ?

చిగురించిన ఆశలను
చితికిన బాటల్లో
చీకట్లు చుట్టుముడితే....
వలయాలై వచ్చిన బాధలు
విలయాలై మారాలి;
మౌనంగా మగ్గిన మనసులు
మంటలై కాదు...
మార్పులై జ్వలించాలి!

పొద్దు పొడుపు నుంచి
పొద్దు విడుపు దాకా
కాయ కష్టంతో కాలం గడిపే చేతులను
మొద్దుల్ని చేసి,
ముద్దకు దూరం చేసే వ్యవస్థా...
ఇది ఘోరం!
ఇది దారుణం!
దీనినే ఆచారం అంటారా?
అయితే...
అది ఆచారం కాదు,
అపచారం!

వడ్డించిన విస్తరిలా
వెలుగులతో నిండిన బతుకులు కొన్నైతే,
ఎంగిలి మెతుకుల కోసం
ఎదురు చూసే బతుకులు మరికొన్ని...

ఒకరికి అవకాశాల ఆకాశం....
మరొకరికి అవసరాల అగాధం!

సరిహద్దులు దొరకని కష్టాలు,
సమాధానాలు లేని సందేహాలు,
చీకటితో నిండిన జీవితాలు
అయినా...

ఇతరుల జీవితాల్లో
మిణుగురు పురుగుల వెలుగును చూసి
సంతోషించే మనసులూ ఉన్నాయి;
ఆ వెలుగును ఆర్పాలని
అసూయతో కాపుకాసే మనుషులూ ఉన్నారు.

కానీ కాలం....
ఎవరినీ శాశ్వతంగా
ఒకే సింహాసనంపై కూర్చోబెట్టదు;
ఎవరినీ శాశ్వతంగా
ఒకే చీకటిలో ఉంచదు.

నిజం నడక నెమ్మదైనా
దాని అడుగులు ఆగవు!

నిర్భయంగా నిలబడిన నిజం
నిస్తేజమైన ముఖాలపై
నిజమైన రంగును పూస్తుంది;
నాటకీయ సత్యాల
ఆర్భాటపు తెరలను
కాలమే చింపేస్తుంది.

"రాజు తలుచుకుంటే
దెబ్బలకు కొదువా?"
అనే అధికార అహంకారం
ఎంత ఎత్తుకు ఎగిరినా---
కాలం ముందు
అది ఒక క్షణిక నీడ మాత్రమే!

అధికారంతో అణిచినవాడు
ఒకరోజు అధికారానికే
అణగాల్సి వస్తుంది.

ఇతరుల కన్నీళ్లపై
రాక్షసానందం పొందిన కళ్ళు
ఒకరోజు
తమ కన్నీళ్లలోనే
తమ ప్రతిబింబాన్ని వెతుకుతాయి.

గర్వంతో మూసుకున్న కళ్ళకు
గర్భభంగం వచ్చినా
తెరుచుకోని లోకం ఇది...

కానీ....
చరిత్ర కళ్ళు తెరిచే ఉంటుంది!
కాలం అన్నీ గుర్తుపెట్టుకుంటుంది!

ఆకలిని చూసి
అన్నం పంచుదాం;
అన్యాయాన్ని చూసి
ప్రశ్నిద్దాం;
అణచివేతను చూసి
అండగా నిలుద్దాం;
వ్యసనంలో కూరుకుపోయినవాడిని
వేలెత్తి చూపకుండా
వెలుగువైపు నడిపిద్దాం.

చెదిరిన గుండెలకు
చేయూత అవుదాం;
విసిగిన జీవితాలకు
విశ్వాసం అవుదాం;
కన్నీటి బిందువులకు
కదిలే హృదయం అవుదాం.

ఎందుకంటే...

సమాజం అంటే
సమూహంగా నిలబడిన మనుషులు కాదు;
ఒకరి బాధకు
మరొకరి హృదయం స్పందించడమే!

బతుకు పోరులో
పడిపోయినవాడిని తొక్కడం కాదు
చేయి అందించి లేపడమే మానవత్వం.

వెలుగులో నడిచేవాడిని
చూసి అసూయపడటం కాదు
ఆ వెలుగులో
మరొక దీపం వెలిగించడమే నాగరికత.

అధికారం శాశ్వతం కాదు...
అహంకారం అమరం కాదు...
ధనం వెంట రాదు...
పదవి వెంట నడవదు...

మనిషి వెళ్లిపోయిన తర్వాత
అతని వెంట నడిచేది ఒక్కటే

అతను పంచిన మానవత్వం!
అతను చేసిన మంచితనం!
అతను మిగిల్చిన ముద్ర!

మౌనంగా ఉండకు....
నీ మౌనం ఒక అన్యాయానికి
ఆయుధం కావచ్చు!

భయపడకు...
నీ ధైర్యం ఒక బతుకుకు
దారిచూపవచ్చు!

నిరాశ చెందకు....
నీ చిన్న ఆశ
మరో జీవితానికి
ఉదయకిరణం కావచ్చు!

చీకటి ఎంత పెద్దదైనా
ఒక చిన్న దీపాన్ని ఓడించలేదు.

అన్యాయం ఎంత బలమైనా
ఒక నిజమైన స్వరాన్ని శాశ్వతంగా
అణచలేకపోయింది.

బతుకు ఎంత కఠినమైనా
మనిషి సంకల్పం ముందు
అది చివరికి తలవంచక తప్పదు!

ఇది నా బతుకు కాదు...
మన బతుకుల సాక్ష్యం.

ఇది నా కన్నీరు కాదు...
మన సమాజపు కన్నీటి చరిత్ర.

ఇది నా గొంతు కాదు...
గొంతు నొక్కబడిన కోట్ల మంది
మనుషుల నిశ్శబ్ద స్వరం.

ఆ నిశ్శబ్దం
ఒకరోజు ప్రశ్నగా మారుతుంది...
ప్రశ్న ఉద్యమంగా మారుతుంది...
ఉద్యమం మార్పుగా మారుతుంది...
ఆ మార్పే...
కొత్త సమాజానికి ఉదయంగా మారుతుంది!

"మనిషిని మనిషిగా చూసే రోజు వచ్చినప్పుడే

బతుకు నిజంగా బతుకవుతుంది.

దేశిని శ్రీధర్ గౌడ్
ప్రిన్సిపల్,ఎస్ఆర్ జూనియర్ కళాశాల
(హనుమకొండ)
9849818284

భీమిని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



● మంచిర్యాల జిల్లా, రైతు సంఘం

● కార్యదర్శి, కొండు బానేష్.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మంచిర్యాల జిల్లాలోని భీమిని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, మంచిర్యాల జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొండు బానేష్, డిమాండ్ చేశారు.
భీమిని మండలంలోని అక్కల పెల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) భీమిని మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
తీవ్ర వర్షా బావ రిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భీమిని మండలాన్ని కరువు జాబితాలో చేర్చాలని, ఎల్ నినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని. పంటల సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, కరువు పరిస్థితుల కారణంగా తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్ర మైతున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు.
రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని భీమిని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో దుర్గం రాజేష్, దుర్గం ఓంకార్,చాపిడి భీమయ్య, దుర్గం శివరాం, దుర్గం శంకర్, జాడి పోచం, జాడి లక్ష్మి, దుర్గం పద్మ, చాపిడి రాజన్న, దుర్గం వంశీ, తదితరులు పాల్గొన్నారు,

సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై
ఆవిరైన ఆశలు



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రజలు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. 1998లో మూతపడిన ఈ ఫ్యాక్టరీలో మిగిలిన చివరి కట్టడాన్ని సైతం కూల్చివేయడంతో పరిశ్రమ పునఃప్రారంభంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యంత్రాలు, వాహనాలు, ఇతర పరికరాలను స్క్రాప్ కోసం తొలగించే ప్రక్రియ పూర్తయింది. 1978లో మంజూరైన ఈ పరిశ్రమలో 1982లో ఉత్పత్తి ప్రారంభమైంది. ఒకప్పుడు వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించిన ఈ ఫ్యాక్టరీ మూతపడటంతో స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడింది. ఎన్నికల సమయంలో పునఃప్రారంభంపై పలుమార్లు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇటీవల పునరుద్ధరణపై మళ్లీ ఆశలు చిగురించినప్పటికీ, కూల్చి వేతలతో భవిష్యత్తుపై సందిగ్ధత నెలకొంది.
ఫ్యాక్టరీ కోసం భూములిచ్చిన రైతులు తమ భూముల పరిస్థితిపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం



భద్రాద్రి కొత్తగూడెం,(జోర్దార్ వార్తలు)ఆదివాసీల భూమి, హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైన నేపథ్యంలో, గిరిజనుల హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలమైన న్యాయపరమైన వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో భూ దోపిడీని అరికట్టాలని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ నవంబర్ 2న దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

మంచిర్యాల జిల్లాలో విషాదం..
ముగ్గురి మృతి



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో విషాదం నెలకొంది. ఇందారం గ్రామ సమీపంలోని నీటి కుంటలో దిగి ప్రమాదవశాత్తు ముగ్గురు మృతి చెందారు. వలస వ్యాపారులు గ్రామానికి వచ్చి నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం బట్టలు ఉతుక్కునేందుకు నీటి కుంటలో దిగి ప్రమాదవశాత్తు మరణించినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతులు మనేమ్మ(24), కీర్తన(16), కావ్య(9)గా గుర్తించారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

సోమవారం,
అక్టోబర్ 26 2026

నాలుగు నెలలుగా చీకట్లోనే రాజాపూర్ రహదారి!

- కొత్త రోడ్డు నిర్మించారు.. వెలుగులు మాత్రం మరిచారు!
- ఇటీవల కారు ప్రమాదంతో వెలుగులోకి వచ్చిన నిర్లక్ష్యం



రామగిరి జోర్దార్ ప్రతినిధి:రహదారి నిర్మాణం పూర్తయింది.. నెలలు గడిచాయి.. కానీ రాత్రివేళ వెలుగులు నింపాల్సిన సెంట్రల్ లైటింగ్ మాత్రం ఇంకా వెలగడం లేదు. రహదారి అందుబాటులోకి వచ్చినా చీకటి కష్టాలు మాత్రం తీరడం లేదని రామగిరి మండలం సింగరేణి ప్రభావిత ముంపు గ్రామమైన రాజాపూర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా లైట్లు వెలగకపోవడంతో రాత్రి ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదం జరిగినా మారని పరిస్థితి!

రాజాపూర్ కొత్త రహదారిపై ఇటీవల జరిగిన కారు ప్రమాదంలో పలువురు గాయపడటం స్థానికుల్లో ఆందోళన పెంచింది.చీకటిమయమైన రహదారిపై ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాతైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారని ఆశించినా, ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి--ఆర్ అండ్ బి మధ్య బాధ్యత ఎవరిది?

సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి రాకపోవడానికి కారణాలేమిటి? పనులు పూర్తయినా వెలుగులు ఎందుకు రావడం లేదు? సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపమా? లేక బాధ్యతారాహిత్యమా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. సింగరేణి అధికారులకు ఆర్ అండ్ బి అధికారులు వత్తాసు పలుకుతున్నారనే అనుమానాలను కూడా గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ రావాల్సి ఉంది.

మరో ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

ప్రజల భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు మరింత జాప్యం చేయడం సరికాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రాత్రివేళల్లో రహదారిపై వెలుతురు లేకపోవడం వాహనదారులకు, పాదచారులకు ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.నాలుగు నెలలుగా వెలగని లైట్లు.. ప్రమాదం తర్వాత కూడా స్పందన కరువు!మరో ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూస్తారా? అన్న ప్రశ్న ఇప్పుడు రాజాపూర్ ప్రజల్లో వినిపిస్తోంది.

50 ఏళ్ల స్నేహితుడికి పాటతో కన్నీటి వీడ్కోలు!

- పీటీ స్వామి పాడె మోసి.. స్వయంగా పాట రాసి పాడిన నూనె రాజేశం



రామగుండం జోర్దార్ ప్రతినిధి: బసంత్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన గోదావరిఖనికి చెందిన సీనియర్ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త పీటీ స్వామికి ఆయన ఆత్మీయ మిత్రుడు, రామగిరి మండలానికి చెందిన నూనె రాజేశం కన్నీటి వీడ్కోలు పలికారు. ఐదు దశాబ్దాల స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ స్వామి మృతదేహం వద్ద భావోద్వేగానికి లోనయ్యారు.పీటీ స్వామి మరణవార్త తెలిసిన వెంటనే గోదావరిఖనిలోని ఆయన నివాసానికి చేరుకున్న నూనె రాజేశం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన 50 ఏళ్ల స్నేహితుడిని కోల్పోయానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మిత్రుడి చివరి ప్రయాణంలో పాడె మోసి, ఆయనకు నివాళిగా స్వయంగా పాట రాసి పాడుతూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. స్వామి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

స్నేహానికి సజీవ సాక్ష్యం.. పాటతో చివరి నివాళి!

ఐదు దశాబ్దాలుగా కొనసాగిన స్నేహం చివరకు కన్నీటి వీడ్కోలుతో ముగియడం పలువురిని కదిలించింది. ఆత్మీయ మిత్రుడి మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన రాజేశం, పాట రూపంలో తన బాధను వ్యక్తం చేస్తూ చివరి వీడ్కోలు పలికారు. స్నేహానికి వయసుతో సంబంధం లేదని, ఆత్మీయతకు మరణం ముగింపు కాదని ఆయన చర్య చాటిచెప్పింది.నూనె రాజేశం సామాజిక కార్యకర్తగా, సాహితీవేత్తగా, తెలంగాణ తొలి, మలి, చివరి దశ ఉద్యమకారుడిగా సేవలందిస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాచరణ కమిటీ సమన్వయకర్తగా, ముదిరాజ్ బీసీ సంక్షేమ సంఘం మంథని డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉత్తమ కవి, రచయితగా గుర్తింపు పొందిన ఆయన సింగరేణి పదవీ విరమణ ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా కూడా కొనసాగుతున్నారు. పీటీ స్వామి మరణంతో ఓ ఆత్మీయ మిత్రుడిని కోల్పోయిన నూనె రాజేశం భావోద్వేగ వీడ్కోలు అక్కడున్న వారిని కదిలించింది.

26 ఏళ్ల ఎడబాటు.. ఒక్కచోట చేరిన పాత జ్ఞాపకాలు

- వందన హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- గురువులకు ఘన సన్మానం.. పాఠశాల రోజుల్ని గుర్తుచేసుకుంటూ సందడి



రామగిరి జోర్దార్ ప్రతినిధి: కాలం మారింది.. చదువులు పూర్తయ్యాయి.. జీవన ప్రయాణంలో ఎవరి దారి వారిదైంది. కానీ పాఠశాలలో కలిసిమెలిసి గడిపిన రోజులు, గురువులు నేర్పిన పాఠాలు, స్నేహితులతో పంచుకున్న మధురానుభూతులు మాత్రం చెరిగిపోలేదు. అలా 26 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట చేరిన వందన హైస్కూల్, లద్నాపూర్ 1999--2000 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థుల పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు.రామగిరిలోని సాయిరాం గార్డెన్‌లో నిర్వహించిన ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల కలయికతో సందడిగా సాగింది.ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, పాఠశాల రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, తరగతి గది అనుభవాలు, గురువులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత జీవితంలో ఎదురైన అనుభవాలను పరస్పరం పంచుకుంటూ పాత స్నేహబంధాలను మరోసారి పదిలం చేసుకున్నారు.

అక్షరాలు నేర్పిన గురువులకు ఆత్మీయ సత్కారం తమకు విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణతో కూడిన జీవితానికి పునాది వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, గురువుల పట్ల తమకున్న గౌరవం, కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలిచిన ఉపాధ్యాయులను ఒకే వేదికపై గౌరవించుకోవడం ఈ సమ్మేళనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ముద్దు లక్ష్మణ్‌తో పాటు తాటి లక్ష్మణ్, అవధానుల శ్రీనివాస్, శంకర్ సార్, రవికిరణ్ సార్, వెంకటేశ్వర్, సత్యనారాయణ సార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తమ పూర్వ విద్యార్థులను కలుసుకున్న ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ వారిని ఆశీర్వదించారు.

విద్యార్థుల ఎదుగుదలే గురువులకు నిజమైన సంతోషం

తమ వద్ద విద్యనభ్యసించిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.పాఠశాల రోజుల నుంచి నేటి వరకు విద్యార్థులతో కొనసాగిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి, సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవడం గురువులకు దక్కే గొప్ప సంతృప్తి అని తెలిపారు.

జీవితంలో ఉన్నతికి గురువుల బోధనలే పునాది

పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, పాఠశాల రోజుల్లో గురువులు నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువలు, పట్టుదల తమ జీవితాల్లో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవడంలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని గుర్తు చేసుకున్నారు. 26 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడం, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా నిలిచిపోతుందని ఆనందం వ్యక్తం చేశారు.

స్నేహానికి కాలం అడ్డుకాదని చాటిన కలయిక

ఏళ్ల తరబడి దూరంగా ఉన్నా స్నేహబంధాలు చెక్కుచెదరలేదని ఈ సమ్మేళనం చాటిచెప్పింది. పాత మిత్రుల ఆత్మీయ పలకరింపులు, గురువుల ఆశీస్సులు, పాఠశాల జ్ఞాపకాలతో సాయిరాం గార్డెన్ సందడిగా మారింది. విద్యార్థుల జీవితాల్లో గురువుల స్థానం ఎంత ప్రత్యేకమో, బాల్య స్నేహాల విలువ ఎంత గొప్పదో మరోసారి గుర్తుచేస్తూ ఈ ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.

సీఎంఆర్ బియ్యం అక్రమాలపై సీఐడీ దాడులు



- నలుగురు అదుపులోకి

హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరాలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన సమాచారంతో సీఐడీ అధికారులు ఆదివారం హుజూరాబాద్‌లో దాడులు నిర్వహించారు. పట్టణ శివారులోని వరంగల్ రహదారిపై ఉన్న వరలక్ష్మి రైస్ మిల్లు యజమాని కల్లూరు కృష్ణమూర్తితో పాటు జమ్మికుంటకు చెందిన వ్యాపారులు మల్లికార్జున్, సంపత్, మధులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సన్న బియ్యానికి బదులు దొడ్డు బియ్యం?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ కింద పౌరసరఫరాల శాఖకు సరఫరా చేయాల్సిన సన్న బియ్యానికి బదులుగా దొడ్డు బియ్యం అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం మిల్లర్‌తో పాటు వ్యాపారుల పాత్రపై విచారణ చేపట్టింది. ఈ ఘటనతో హుజూరాబాద్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని రైస్ మిల్లర్లు, వ్యాపార వర్గాల్లో కలకలం రేగింది. ఈ వ్యవహారంలో ఇతరుల ప్రమేయం, అధికారుల పాత్రపై కూడా సీఐడీ ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఓట్ బచావో-దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



- పొడితల ప్రణవ్..

కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి,జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ ఒకటి తారీఖున లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రామ్ లీలా మైదానంలో సర్ ప్రక్రియ,ఓటు చోరికి నిరసనగా జరిగే కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ నుండి పెద్ద ఎత్తున పాల్గొనాలని ఏఐసిసి నుండి వచ్చిన పరిశీలకులు శరత్,సర్ ఇంచార్జికూన శ్రీశైలం,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు,చొప్పదండి శాసనసభ్యుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,మానకొండూరు శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు.ఆదివారం రోజున కరీంనగర్ పట్టణంలోని ఇందిరా(డిసిసి) భవన్ ఏర్పాట్లకు సంబంధించి జరిగిన సమావేశంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ఓట్ బచావో-దేశ్ బచావో నినాదంతో దేశంలోని పౌరుల ఓటు హక్కు కాపాడాలని ముందుకు వెళ్తున్నామని,ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఓటు చోరీ ఏ విధంగా జరిగిందో రాహుల్ గాంధీ వివరించారనీ,ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి రామ్ లీలా మైదానంలోజరిగే నిరసన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.ఓటు చోర్ పై ఇప్పటికే గ్రామ,గ్రామాన వివరించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్,రాష్ట్ర మున్నూరు కాపు సంఘ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,సుడా మాజీ చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు అంజన్ కుమార్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని మాజీ ఎమ్మెల్యే ఆరపల్లి మోహన్,పురమల్ల శ్రీనివాస్,నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన చందుపట్ల కీర్తిరెడ్డి



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల మండలంలోని పీఆర్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎలుకాటి ఉమాదేవి ప్రవీణ్ దంపతుల కుమార్తె ప్రశాంతి సారీ ఫంక్షన్ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి హాజరై చిన్నారి ప్రశాంతిని ఆశీర్వదించారు. చిన్నారి భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గాజుల అజయ్, బండారి సమ్మయ్య, సుబ్బక్కపల్లి సర్పంచ్ బొడ్డు రాజేందర్, బీజేవైఎం జిల్లా నాయకుడు పంజాల కుమార్ గౌడ్, జిల్లా నాయకులు కూర సురేందర్ రెడ్డి, బట్టల మొగిలి తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల మండలంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ముందుగా పత్రికా విలేకరి ఎల్కటి ప్రవీణ్ కుమార్తె సారీ ఫంక్షన్‌కు హాజరై చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెల్లంపల్లి గ్రామానికి చెందిన దుస్సా రవి అక్క తాడవేణి బుచ్చమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన సంపంగి బక్కయ్య పాముకాటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని గండ్ర వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, నాయకులు బందెల నరేష్, ఆది రఘు, పింగిలి వెంకటేశ్వరరెడ్డి, మారం లింగారెడ్డి, గువ్వాడి లక్ష్మణ్, టేకుమట్ల సర్పంచ్‌లు మాట్ల శ్రీనివాస్, నల్ల వెంకట రమణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు నిమ్మల స్వామి, నానవేణి కుమార్, ఓదెల రాజ్‌కుమార్, గిరావెనా భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొకరికెలి చూడకు దొరలకెలి అసలే చూడకు

ఏష నాగుల కట్టపై
ఊయలలో సంబురంగ
తను తనలా ఊగక, ఉండక...
ఇతరులతో పోల్చుకుంటూ
వాళ్ళేమి తింటున్నారో చూస్తూ
దొరలు తాగే ఇప్పసారపై,
ప్యారడైజ్ హోటళ్ల బిర్యానీలపై
మోజు పెంచుకున్నాడో ...
అప్పుడు మొదలైంది పతనం
ఆ పతనం ఎందాక దారి తీసిందంటే...
తన వేషభాషను కోల్పోయి
ఆహారపు అలవాట్లను మార్చుకొని
చివరకు తన ఉనికిని కోల్పోతున్నాడు
దొరలా బతకలేక,
అతనిలా అతడు జీవించలేక
రెంటికీ చెడ్డ రేవడిలా వున్న వాన్ని చూసి
ఎవడో ఒకడొచ్చి ఎక్కిరిస్తే...
అప్పుడు మొదలవుతుంది
గుర్తింపు కోసం పోరాటం
అందాక ఎందుకు
మనలామనముంటూ ...
మనలను మనమే...
నవీకరించుంకుంటూ,సంస్కరించుకుంటే
సరిపోదా...

రాపాక శ్రీనివాస్

డేట్స్ ఆపిల్ ఖీర్

కావలసిన పదార్థాలు:ఖర్జూరాలు: పది, ఆపిల్: ఒకటి,పాలు: ఒక లీటర్, చక్కెర: ఒక కప్పు, యాలకుల పొడి: పావు టీస్పూన్, డ్రైఫ్రూట్స్: ఒక టేబుల్ స్పూన్.

తయారీ విధానం:ఆపిల్ పండును చిన్నచిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి అరకప్పు నీళ్లు పోసి ఆపిల్ ముక్కలు, ఒక టీస్పూన్ చక్కెర వేసి పది నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించి పక్కనపెట్టాలి. గింజ తీసిన ఖర్జూరాలను మిక్సీలో మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. స్టవ్‌మీద మందపాటి గిన్నెపెట్టి పాలు, చక్కెర వేసి సన్నని మంటపై కలుపుతూ మరిగించాలి. పాలు చిక్కగా అయ్యాక ఖర్జూర పేస్ట్, యాలకుల పొడి వేసి మరికాసేపు ఉడికించాలి.

చివరిగా ఉడికించిన ఆపిల్ ముక్కలు, డ్రైఫ్రూట్స్ వేసుకుంటే నోరూరించే డేట్స్ ఆపిల్ ఖీర్ సిద్ధం

ఒక పాట.. ఒక మాట

ఏది ముందు ఏది వెనుక
మనుషులను కట్టిపడేసేది మాట
మనసులను ఏకం చేసేది పాట
దేని ప్రాధాన్యత దానిదే కదా
వట్టి మాటలు వద్దంటారు
ఉత్తేజమిచ్చే మాటలే కావాలి
సారం లేని పాటలు వద్దంటారు
భరోసానిచ్చే గేయాలు కావాలి
నాకు పాటలన్న మాటలన్న
చూపునిచ్చే రెండు కళ్ళలాంటివి
మాటలు వినిపించిన ప్రదేశాల్లో
పాటలు మార్మోగుతున్న సమావేశాల్లో
చెట్లపై పక్షులు వాలినట్లుగా
జన సందోహంలో కలిసిపోతాను



- గోపగాని రవీందర్
9440979882

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీత అంతం - మా పంతం

జోర్దార్ ప్రత్యేక కథనం

సన్నరకం ధాన్యం అక్రమ మళ్లింపు బట్టబయలు-జోర్దార్ ఎక్స్‌ప్రెస్ కథనంతో కదిలిన యంత్రాంగం!

- ముఖ్యమంత్రికి పొరుడి ఫిర్యాదుతో రంగంలోకి సీఐడీ
- జమ్మికుంట, ములుగులో మిల్లుల యజమానుల అరెస్ట్



(ఫైదరాబాద్ / కరీంనగర్: జోర్దార్ ప్రతినిధి)రాష్ట్రంలో సన్నరకం ధాన్యాన్ని దారి మళ్లించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న భారీ కుంభకోణాన్ని 'జోర్దార్ దినపత్రిక రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా వెలుగులోకి తెచ్చింది. ఈ అక్రమాలపై జోర్దార్ మొట్టమొదటిసారిగా ప్రచురించిన సంచలన వార్త రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ వార్త ఆధారంగా కరీంనగర్ కు చెందిన కాచం శ్రీనివాస్ అనే పౌరుడు నేరుగా ముఖ్య మంత్రి గారికి ఫిర్యాదు చేయడంతో, ప్రభుత్వం తక్షణమే స్పందించి అత్యున్నత స్థాయిలో తగిన చర్యలు చేపట్టడంతో ఈ భారీ అవినీతి బట్టబయలైంది.

అవకతవకలపై సీఐడీ ఎంట్రీ మరియు దర్యాప్తు:
ఖరీఫ్ 2025-26లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కి బియ్యం సరఫరాలో జరిగిన అవకతవకలపై సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్మెంట్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ సిఐడి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.
ప్రభుత్వం ఎఫ్‌సిఐ కి సరఫరా చేయాల్సిన 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను, ఖరీఫ్ 2025-26లో 71.86 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించింది.
ప్రాథమిక సమాచారం ప్రకారం, కొంతమంది రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన సన్నరకం వరిని బహిరంగ మార్కెట్కు మళ్లించి, దాని స్థానంలో ఇతరరాష్ట్రల నుండి దొడ్డు రకాన్ని తక్కువ ధరకు తెప్పించి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు టాస్క్ ఫోర్స్ (ఈ టి ఎఫ్) బృందాల తనిఖీల్లో సరఫరా చేసిన బియ్యం నమూనాలు సన్నా రకానికి అనుగుణంగా లేవని తేలింది.

పెద్దఎత్తున ఆర్థిక నష్టం -- జిల్లాల్లో అరెస్టుల పర్వం:
నిజామాబాద్, కరీంనగర్ మరియు ములుగు జిల్లాలలో 16 రైస్ మిల్లర్లు సన్న రకం కేటాయింపులకు బదులుగా 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యాన్ని సరఫరా చేసినట్లు తేలింది. దీనివల్ల బోనస్‌కు సంబంధించిన అంచనా నష్టం సుమారు రూ. 1.69 కోట్లుగా ఉంది. మార్పిడి కోసం అదనంగా 45,414.833 మెట్రిక్ టన్నుల పరిమాణాన్ని కేటాయించడం వల్ల సుమారు రూ. 242 కోట్ల ఆర్థిక ప్రభావం పడుతుందని అంచనా.
ఈ అక్రమాలకు పాల్పడిన కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ముగ్గురు మిల్లర్లతో పాటు, ములుగు తదితర ప్రాంతాలలో కలిపి మొత్తం 14 మంది మిల్లు యజమానులను పోలీసులు మరియు సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.

ఇప్పటివరకు మూడు క్రిమినల్ కేసులు నమోదు చేయబడ్డాయి.
మిల్లు యజమానుల పాత్ర, అధికారుల కేటాయింపులు మరియు మార్పిడి అభ్యర్థనలను ప్రాసెస్ చేసిన విధానం, డాక్యుమెంటరీలు, సాంకేతిక మరియు ఇతర బలమైన సాక్ష్యాలను సేకరించి దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు.
సన్నరకం ధాన్యం అక్రమాలపై జోర్దార్ చేపట్టిన ఒత్తిడి మరియు రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ తీసుకున్న కఠిన చర్యల పట్ల ప్రజల నుండి హర్షం వ్యక్తమవుతోంది

సన్న బియ్యం కేటాయింపులపై కరీంనగర్ పౌరసరఫరాల డీఎస్వో లను ఇన్వెస్టిగేషన్! చేసిన సిఐడి అధికారులు

కరీంనగర్ (జోర్దార్ ప్రతినిధి)కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల శాఖలో ధాన్యం కేటాయింపులు, బియ్యం మిల్లింగ్ వ్యవహారంలో జరిగిన భారీ అక్రమాలపై సీఐడీ విచారణ వేగవంతం చేసింది. ప్రభుత్వం సరఫరా చేసిన సన్న రకం ధాన్యానికి బదులుగా తక్కువ విలువ కలిగిన దొడ్డు రకం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించిన ఉదంతంపై సీఐడీ అధికారులు లోతైన ఇన్వెస్టిగేషన్ చేపట్టారు.
ఈ కుంభకోణంలో అధికారుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల అధికారి నరసింగ రావు మరియు జిల్లా మేనేజర్ లను సీఐడీ కార్యాలయానికి పిలిపించి అధికారులు విచారణ జరిపినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.

సన్న రకం స్థానంలో దొడ్డు రకం
సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతుల వద్ద నుంచి సేకరించిన సన్న రకం ధాన్యాన్ని మిల్లింగ్ కోసం రైస్ మిల్లర్లకు కేటాయిస్తారు. నిబంధనల ప్రకారం మిల్లింగ్ పూర్తయిన తర్వాత సన్న రకం బియ్యాన్ని తిరిగి ప్రభుత్వ గోదాములకు అప్పగించాల్సి ఉంటుంది.
అయితే, కొందరు మిల్లర్లు మరియు అధికారుల మధ్య లోపాయికారీ ఒప్పందం నడిచిందనే ఆరోపణలు వస్తున్నాయి
సన్న బియ్యం దారిమళ్లింపు చేసి ప్రభుత్వం నుంచి పొందిన సన్న రకం బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు.
దొడ్డు రకం అప్పగింత ఆ స్థానంలో నాణ్యత లేని, తక్కువ ధర కలిగిన దొడ్డు రకం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించి లెక్కలు సరిచేశారు.
కోట్లలో అక్రమార్జన ధాన్యం రకాల్లో వ్యత్యాసం ద్వారా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించినట్లు ప్రాథమిక అంచనా.

సీఐడీ ఆఫీస్‌లో తీవ్రస్థాయి ఇన్వెస్టిగేషన్
రైస్ మిల్లుల నుంచి వచ్చే బియ్యం నాణ్యత, రకాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డుల్లో నమోదు చేయాల్సిన బాధ్యత జిల్లా పౌరసరఫరాల అధికారులపైనే ఉంటుంది. సన్న రకానికి బదులు దొడ్డు రకం బియ్యం వస్తున్నా అధికారులు పర్యవేక్షించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
ఈ నేపథ్యంలోనే డీఎస్వో నరసింగహారావు మరియు డీఎంలను సీఐడీ ఆఫీసుకు పిలిపించి గంటల పాటు విచారించినట్లు తెలిసింది. ముఖ్యంగా క్రింది అంశాలపై ఇన్వెస్టిగేషన్ సాగినట్లు సమాచారం
ధాన్యం కేటాయింపుల వివరాలు ఏ మిల్లర్లకు ఎంత పరిమాణంలో సన్న రకం ధాన్యం కేటాయించారు?
క్వాలిటీ చెకింగ్ రిపోర్టులు గోదాముల్లో ధాన్యాన్ని స్వీకరించే ముందు నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేశారా? లేదా?
అధికారుల నిర్లక్ష్యం ప్రమేయం ఈ బియ్యం మార్పిడి వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చిందా? లేదా తెలిసి కూడా మిల్లర్లతో కుమ్మక్కయ్యారా?

ప్రక్షాళన దిశగా సీఐడీ అడుగులు
ప్రభుత్వం పేదలకు నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తుంటే, క్షేత్రస్థాయిలో ఇలాంటి మాయాజాలం జరగడం పట్ల ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. సీఐడీ విచారణతో కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల శాఖ మరియు రైస్ మిల్లింగ్ రంగంలో తీవ్ర కలకలం రేగింది. ఈ విచారణ అనంతరం మరికొందరు అధికారులపై మరియు మిల్లర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

బతుకమ్మ సొళ్లలో వ్యవసాయ మోటార్ చోరీ

- 60 వేల విలువ పోలీసులకు రైతు ఫిర్యాదు



హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజురాబాద్ పట్టణంలోని బతుకమ్మ సొళ్లలో వ్యవసాయ మోటార్ చోరీకి గురైంది. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన రైతు ఇప్పలపల్లి శంకర్‌కు బతుకమ్మ సొళ్లలో చెక్‌డ్యామ్ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లిన శంకర్‌కు వ్యవసాయ మోటార్ కనిపించలేదు. పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌ను అపహరించినట్లు భావించారు. చోరీకి గురైన మోటార్ విలువ సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. మోటార్‌ను దొంగిలించిన వారిని గుర్తించి, దానిని స్వాధీనం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతూ హుజురాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్ఆర్ఎల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రారంభోత్సవం



- ప్రారంభించిన మంత్రి

కరీంనగర్,(జోర్దార్ ప్రతినిధి)కరీంనగర్ పట్టణంలో మరో నూతన వ్యాపార సంస్థ అందుబాటులోకి వచ్చింది. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురుగా, డీమార్ట్ లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు సంస్థ యజమాని పొన్నం సాత్విక్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన సంస్థ భవిష్యత్తులో అభివృద్ధి సాధించి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల స్మరణలో

ప్రత్యేక ప్రార్థనలు

- శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని పోలీసుల ఆకాంక్ష



(వీణవంక జోర్దార్ ప్రతినిధి)పోలీసు సంస్మరణ దినోత్సవం, వారోత్సవాల నేపథ్యంలో వీణవంక పోలీసులు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు.
ఆదివారం మండల కేంద్రంలోని మసీదును సందర్శించిన పోలీసులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ పులి వెంకట్, ఎస్సై అవుల తిరుపతి ప్రార్థనలు నిర్వహించి, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.
సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని, ప్రజల మధ్య ఐక్యత, సోదర భావం మరింత బలపడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మైనారిటీ కమిటీ సభ్యులు సీఐను శాలువతో సన్మానించారు.
ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

43 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి స్నేహితులు!



- జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.. గురువులకు ఘన సన్మానం

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)చిన్ననాటి స్నేహబంధాలు.. పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలు.. గురువుల బోధనలు.. ఇలా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహభరితంగా జరిగింది. పదో తరగతి పూర్తి చేసుకుని 43 ఏళ్లు గడిచిన అనంతరం మళ్లీ ఒకేచోట కలుసుకున్న మిత్రులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి అనుభవాలను పంచుకున్నారు. పాఠశాల జీవితంలో జరిగిన సరదా సంఘటనలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు పునాది వేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు అందుకున్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయులు తాసిల్ అలీ, మధుసూదన్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఘనంగా నిర్వహణ



హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988--89 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.
పదో తరగతి చదివిన విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.
వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుని తమ యోగక్షేమాలను పంచుకున్నారు. పాఠశాల పరిసరాల్లో తిరుగుతూ చిన్ననాటి అల్లరి, అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తమతో కలిసి చదువుకుని మరణించిన స్నేహితుల ఆత్మశాంతి కోసం కొద్దిసేపు మౌనం పాటించారు.
తోటి మిత్రులతో సెల్ఫీలు దిగుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

(ఎల్టా) వరంగల్ నూతన కార్యవర్గ ఎన్నిక

జోర్దార్ ప్రతినిధి- వరంగల్:ఆదివారం రోజున జి . హెచ్.ఎస్ హనుమకొండ లో లి(ఎల్టా) రాష్ట్ర అధ్యక్షులు టీ. వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ నూతన కార్యవర్గ ఏర్పాటుకు ఎలక్షన్ ప్రక్రియను నిర్వహించారు. వరంగల్ జిల్లా లి(ఎల్టా) అధ్యక్షులుగా బహునూతుల శశికుమార్ (జి.ప.ఉ.పాఠశాల ఖానాపూర్), ప్రధాన కార్యదర్శిగా , పెట్టుగడి శ్రీనివాస్ (జి.ప.ఉ.పాఠశాల భాంజీపేట) , కోశాధికారిగా పులి రాము (టీ.జీ.ఎం.ఎస్) అమీనాబాద్), జాయింట్ సెక్రెటరీగా శ్రీమతి టీ. శాంతి కిరణ్ (పర్వతగిరి), రాష్ట్ర కౌన్సిలర్గా శ్రీ బీ. మహేంద్రనాథ్, మీడియా ఇంచార్జ్‌గా పోగు అశోక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కొంగర దయాకర్ లు ఎన్నికయ్యారు.
ఈ ఎన్నికల సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగర లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీ కొక్కుల సంపత్, అసోసియేట్ అధ్యక్షులు పూల శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం



జోగులాంబ గద్వాల జిల్లా,(జోర్దార్ ప్రతినిధి):పేద ప్రజల ఎన్నో ఏళ్ల సొంతింటి కలను ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేరుస్తున్నామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.గద్వాల జిల్లా కేంద్రంలోని 35వ వార్డుకు చెందిన లబ్ధిదారునికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో ఆదివారం నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. నూతన గృహప్రవేశం చేసుకున్న లబ్ధిదారులకు కానుకను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను లబ్ధిదారులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కల సాకారమవుతుండటం సంతోషకరమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం విడతల వారీగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ సహాయానికి అదనంగా లబ్ధిదారులు తమ వంతు నిధులు సమకూర్చుకొని ఇళ్లను అవసరమైన సౌకర్యాలతో నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు.గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 2,000కు పైగా ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరైన వారు నిర్మాణ పనులు చేపడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం అందుతుందని, అర్హత ఉన్నప్పటికీ మొదటి విడతలో ఇళ్లు మంజూరు కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

రెండో విడతలో అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ బాబర్, మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు యాదవ్, మురళి, ఇసాక్, గోవిందు, కురుమన్న, రిజ్వాన్, ధర్మనాయుడు, వీరేష్, పూడూరు చిన్నయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
సోమవారం, అక్టోబర్ 26 2026

తొలి 13 బంతుల్లో 17.. ఆ తర్వాత 13 బంతుల్లో బీభత్సం.



న్యూజిలాండ్‌తో రెండో టీ20లో భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ అద్భుతమైన ఫినిషింగ్‌తో ఆకట్టుకున్నాడు. 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న సమయంలో టీమిండియా వరుస వికెట్లు కోల్పోయి ఒత్తిడిలోకి వెళ్లింది. అయితే తిలక్ క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత మ్యాచ్ గమనమే మారిపోయింది.తిలక్ తన ఇన్నింగ్స్ తొలి 13 బంతుల్లో 17 పరుగులు మాత్రమే చేశాడు. ఆ సమయంలో అతడు పరిస్థితిని అర్థం చేసుకుంటూ వికెట్ కాపాడుకున్నాడు. అయితే ఆ తర్వాత తిలక్ బ్యాటింగ్‌లో ఒక్కసారిగా వేగం పెరిగింది.తిలక్ తన ఇన్నింగ్స్ తొలి 13 బంతుల్లో 17 పరుగులు మాత్రమే చేశాడు. ఆ సమయంలో అతడు పరిస్థితిని అర్థం చేసుకుంటూ వికెట్ కాపాడుకున్నాడు. అయితే ఆ తర్వాత తిలక్ బ్యాటింగ్‌లో ఒక్కసారిగా వేగం పెరిగింది.తర్వాతి 13 బంతుల్లోనే 34 పరుగులు రాబట్టాడు. అంటే ఇన్నింగ్స్ రెండో భాగంలో అతడి పరుగుల వేగం ఏ స్థాయిలో ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయి. బౌండరీలు, భారీ షాట్లతో న్యూజిలాండ్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు.తర్వాతి 13 బంతుల్లోనే 34 పరుగులు రాబట్టాడు. అంటే ఇన్నింగ్స్ రెండో భాగంలో అతడి పరుగుల వేగం ఏ స్థాయిలో ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయి. బౌండరీలు, భారీ షాట్లతో న్యూజిలాండ్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడుముఖ్యంగా మ్యాచ్ కీలక దశలో తిలక్ చూపించిన దూకుడు టీమిండియాకు ఎంతో ఉపయోగపడింది. మరో ఎండ్‌లో నితీశ్ కుమార్ రెడ్డి కూడా వేగంగా పరుగులు చేయడంతో భారత్ విజయానికి చేరువైంది.ముఖ్యంగా మ్యాచ్ కీలక దశలో తిలక్ చూపించిన దూకుడు టీమిండియాకు ఎంతో ఉపయోగపడింది. మరో ఎండ్‌లో నితీశ్ కుమార్ రెడ్డి (చీఱ్ఱంష్ట్ర ఖబఝితీ ఒక దశలో భారత్ ఓటమి ప్రమాదంలో ఉన్నట్లు కనిపించినా.. తిలక్, నితీశ్ కలిసి పరిస్థితిని పూర్తిగా మార్చేశారు. ఒత్తిడిలో ప్రశాంతంగా ఆడి, చివర్లో భారీ షాట్లతో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పిన తిలక్ వర్మ ఫినిషింగ్ ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఒక దశలో భారత్ ఓటమి ప్రమాదంలో ఉన్నట్లు కనిపించినా.. తిలక్, నితీశ్ కలిసి పరిస్థితిని పూర్తిగా మార్చేశారు. ఒత్తిడిలో ప్రశాంతంగా ఆడి, చివర్లో భారీ షాట్లతో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పిన తిలక్ వర్మ ఫినిషింగ్ ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.13 బంతులు -- 17 పరుగులు.. తర్వాతి 13 బంతులు -- 34 పరుగులు. తిలక్ వర్మ ఇన్నింగ్స్‌లో వచ్చిన ఈ వేగవంతమైన మార్పే అతడి అద్భుత ఫినిషింగ్‌కు నిదర్శనం.తొలి 13 బంతులు -- 17 పరుగులు.. తర్వాతి 13 బంతులు -- 34 పరుగులు. తిలక్ వర్మ ఇన్నింగ్స్‌లో వచ్చిన ఈ

బంగారం కొనేవారికి బిగ్ అలర్ట్.. ధరల్లో స్వల్ప మార్పులు..



బంగారం, వెండి కొనుగోలు దారులకు ఊహించని పరిణామం ఎదురైంది. గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం, వెండి ధరలు ఇప్పుడు మళ్లీ పుంజుకుంటున్నాయి. డాలర్ విలవ మారకం, అంతర్జాతీయ ఉద్రిక్తల కారణంగా ఈ మార్పులు చోటుచేసుకుంటున్నట్టు విశ్లేషనకులు చెబుతున్నారు. అక్టోబర్ 24తో పోల్చుకుంటే అక్టోబర్ 25న ఆదివారం ఉదయం 6గంటలకు తులం బంగారం ధరపై రూ.100 వరకు పెరిగింది. శనివారం 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,42,470 దీనిపై రూ.100 పెరిగి ఆదివారం తులం ధర రూ.1,42,580కి చేరింది.ప్రధాన నగరాల్లో ధరల వివరాలు:
హైదరాబాద్‌లో 24 క్యార్లె 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,580 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,700 వద్ద కొనసాగుతోంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,580 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,700 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,730 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,850 వద్ద కొనసాగుతోంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,580 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,700 వద్ద కొనసాగుతోంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,580 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,700 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,580 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,700 వద్ద కొనసాగుతోంది.వెండి ధరలు ఇలాఇక వెండి విషయానికొస్తే.. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.2,20,000గా ఉండగా అక్టోబర్ 24 శనివారం రోజు కిలో వెండి ధర రూ.2,19,900 వద్ద ట్రేడవుతోంది

టీ20ల్లో అభిషేక్ శర్మ అరుదైన రికార్డ్.. ఒకే ఏడాదిలో దుమ్మురేపాడుగా..



భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000 టీ20ఐ పరుగులు పూర్తి చేసిన భారత మూడో బ్యాటర్‌గా నిలిచాడు.ఈ జాబితాలో అభిషేక్ కంటే ముందు సూర్యకుమార్ యాదవ్2022లో 1,164 పరుగులు, ఇషాన్ కిషన్ 2026లో 1,159 పరుగులు సాధించారు.1000ం టీ20ఐ పరుగులు.. 8 మంది మాత్రమే!ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1000 లేదా అంతకంటే ఎక్కువ టీ20ఐ పరుగులు సాధించడం అత్యంత అరుదైన ఘనత. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 8 మంది ఆటగాళ్లు మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నారు. అభిషేక్ శర్మ 2026లో 1000 టీ20ఐ పరుగులు పూర్తి చేసి చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత సాధించిన భారత మూడో ఆటగాడిగా నిలిచిన అభిషేక్.. ప్రపంచవ్యాప్తంగా ఈ రికార్డు సాధించిన 8వ క్రికెటర్‌గా నిలిచాడు.అభిషేక్ శర్మ ఈ జాబితాలో చేరడంతో భారత క్రికెట్‌లో మరోసారి యువ బ్యాటర్ల దూకుడు కనిపించింది. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో వేగంగా పరుగులు సాధించే అతడి సామర్థ్యానికి ఈ రికార్డు నిదర్శనంగా నిలిచింది.
భారత ఆటగాళ్ల రికార్డు-- సూర్కుమార్ యాదవ్ -- 1,164 పరుగులు (2022)-- ఇషాన్ కిషన్ -- 1,159 పరుగులు (2026)-- అభిషేక్ శర్మ -- 1,000ం పరుగులు (2026
ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1000ం టీ20ఐ పరుగులు చేసిన 8వ ఆటగాడిగా అభిషేక్ శర్మ రికార్డు సృష్టించాడు.

బీఎస్ఎన్ఎల్ యూజర్లకు గుడ్‌న్యూస్.. సరికొత్త అప్‌డేట్



మీ మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ సరిగా లేకపోయినా, కాల్స్ తరచుగా కట్ అవుతున్నా, లేదా ఇంటర్నెట్ వేగం తక్కువగా ఉన్నా, ఇది కేవలం ఫోన్ వాడకంలోనే కాకుండా రోజువారీ పనులలో కూడా సమస్యగా మారవచ్చు. ఇటువంటి పరిస్థితిలో కంపెనీ తీసుకుంటున్న కొత్త ఏర్పాట్లు దీూచీూ వినియోగదారులకు చాలా ముఖ్యమైనవి కావచ్చు. దీూచీూ తన 4+ నెట్‌వర్క్‌ను విస్తరించి, 5+ వైపు అడుగులు వేయడానికి సన్నాహాలు చేస్తోంది. అంతేకాకుండా నెట్‌వర్క్ సమాచారం అందించడానికి, ఫిర్యాదులను నమోదు చేయడానికి, సైబర్‌సెక్యూరిటీని మెరుగుపరచడానికి కొత్త కార్యక్రమాలను అమలు చేస్తోంది.ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026 సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడారు. తమ టెలికమ్యూనికేషన్స్ సంస్థ అనేక వినియోగదారు, నెట్‌వర్క్-స్థాయి ప్లాట్‌ఫారమ్‌లను ప్రారంభిస్తూ, తదుపరి తరం మొబైల్ కనెక్టివిటీ వైపు వేగంగా పయనిస్తోందని పేర్కొన్నారు4+ నెట్‌వర్క్ తర్వాత 5+ కోసం సన్నాహాలు:బీఎస్ఎన్ఎల్ తన స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 4+ నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది. ఈ సంస్థ తన నెట్‌వర్క్ పరిధిని విస్తరించడం, టెలికాం సేవలను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. 5+ కోసం కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే, ఈ సమాచారంలో 5+ సేవలను ప్రారంభించేందుకు ఎలాంటి ఖచ్చితమైన తేదీని వెల్లడించలేదు. అందువల్ల వినియోగదారులు ప్రస్తుతానికి 5+ ప్రారంభం కోసం వేచి చూడాల్సి ఉంటుంది. తన వాణి చాట్‌బాట్‌ను మెరుగుపరచడానికి కూడా కృషి చేస్తోంది. దీని ముఖ్య ఉద్దేశ్యం వినియోగదారులకు వారి ప్రాంతంలోని నెట్‌వర్క్ స్థితి గురించి సమాచారం అందించడం, వాయిస్ ద్వారా ఫిర్యాదులు చేయడానికి వీలు కల్పించడం. సులభంగా చెప్పాలంటే, నెట్‌వర్క్ సమస్యలను తెలియజేయడానికి వినియోగదారులు ఇకపై కేవలం టెక్స్ట్ మెసేజ్‌లపై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం ఉండదు.అయితే ఈ ఫీచర్లు అప్‌గ్రేడ్ అవుతున్నాయి. అవి ప్రతి వినియోగదారునికి పూర్తిగా అందుబాటులో ఉన్నాయని భావించడం సరికాదు. నెట్‌వర్క్ పనితీరును పర్యవేక్షించడం, నివేదికలను అందించడం సమస్యలను గుర్తించడంలో సహాయపడతాయి. కానీ అవి త్వరిత పరిష్కారానికి హామీ ఇవ్వవు.నెట్‌వర్క్ భద్రతను మెరుగుపరచడానికి బీఎస్ఎన్ఎల్, సైబర్ సెక్యూరిటీ సంస్థ అయిన సప్తాంగ్ ల్యాబ్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ చొరవ, నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను విశ్లేషించడానికి, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడానికి ఏఐ (ూ×), మెషిన్ లెర్నింగ్‌ను ఉపయోగించుకుంటుంది. సైబర్ ముప్పులను గుర్తించి వేగంగా స్పందించడంలో సహాయపడటమే దీని లక్ష్యం. అయితే ఇటువంటి వ్యవస్థ అన్ని రకాల ఆన్‌లైన్ మోసాల నుండి పూర్తి రక్షణను తప్పనిసరిగా అందించదు.

ఒకట్రెండు కాదు.. షఫాలీ, స్మృతిల వేటకు ఎన్ని రికార్డులు బద్దలయ్యాయో తెలుసా..?



జింబాబ్వేపై రెండో టీ20లో 9 వికెట్ల ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. షఫాలీ వర్మ 55 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో 2026లో అత్యధిక టీ20 అంతర్జాతీయ పరుగుల రికార్డు సృష్టించగా, స్మృతి మంధాన కూడా 821 పరుగులతో ప్రత్యేక జాబితాలో నిలిచింది. భారత్ వరుసగా 10 టీ20 విజయాలు సాధించి మరో కొత్త రికార్డు నమోదు చేసింది.షఫాలీ వర్మకు అగ్రస్థానం.. మంధాన కూడా టాప్‌లో..జింబాబ్వేపై కేవలం 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ వర్మ 2026 క్యాలెండర్ ఇయర్‌లో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 922 పరుగులకు చేరుకుంది. దీంతో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన మహిళా బ్యాటర్‌గా నిలిచింది.ఈ జాబితాలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ 824 పరుగులతో రెండో స్థానంలో ఉంది. భారత స్టార్ స్మృతి మంధాన 821 పరుగులతో మూడో స్థానంలో నిలిచింది. హాంకాంగ్‌కు చెందిన నటాషా మైల్స్ 800 పరుగులు చేయగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఈషా ఓజా 2025లో 779 పరుగులు చేసింది. హాంకాంగ్ బ్యాటర్ యాస్మిన్ దస్వానీ కూడా 2026లో 779 పరుగులు సాధించింది.భారత్‌కు వరుసగా 10 టీ20 విజయాలు.జింబాబ్వేపై విజయం భారత మహిళల జట్టుకు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో వరుసగా 10వ విజయం. 2026లో మొదలైన ఈ విజయాల పరంపర కొనసాగుతోంది.ఇంతకుముందు భారత్ వరుసగా 7 విజయాలు 2018లో సాధించింది. 2012-13, 2016-18, 2019-20, 2025-26 మధ్య ఆరేసి వరుస విజయాల రికార్డులు ఉన్నాయి.2026లో భారత్‌కు 17 టీ20 విజయాలు..ఒక క్యాలెండర్ ఇయర్‌లో భారత్ సాధించిన అత్యధిక టీ20 అంతర్జాతీయ విజయాల రికార్డు కూడా 2026లో నమోదైంది. ఈ ఏడాది భారత మహిళల జట్టు 17 విజయాలు సాధించింది.2018లో 16 విజయాలు, 2024లో 15 విజూలు సాధించిన రికార్డులు గతంలో ఉన్నాయి.వరుస ఓటముల్లో జింబాబ్వే..వరోవైపు జింబాబ్వే మహిళల జట్టుకు ఇది వరుసగా 22వ టీ20 అంతర్జాతీయ ఓటమి. 2025లో మొదలైన ఈ పరాజయాల పరంపర ఇంకా కొనసాగుతోంది.ఈ జాబితాలో ఎస్వాటిని 26 వరుస ఓటములతో అగ్రస్థానంలో ఉంది. మంగోలియా కూడా 2023-26 మధ్య 26 వరుస ఓటములు ఎదుర్కొంది. లెసోతో 20, బల్గేరియా 20 వరుస ఓటములతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.సిక్సర్లలో షఫాలీ, మంధాన ఆధిపత్యం.భారత మహిళల టీ20 అంతర్జాతీయ చరిత్రలో అత్యధిక సిక్సర్లు

ఎయిర్‌టెల్ రూ. 200 ప్యాక్ ప్రయోజనకరమేనా?



సినిమాలు, షోలు స్ట్రీమింగ్ చేసేంత సమయాన్నే యూట్యూబ్ చూసే ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం ఎయిర్‌టెల్ మరో ఆప్షన్‌ను అందిస్తోంది. ఈ టెలికాం ఆపరేటర్ రూ. 200 ఎంటర్‌టైన్‌మెంట్ టాప్-అప్‌ను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా యూట్యూబ్ ప్రీమియంతో పాటు 30+దీ డేటా, 28 రోజుల పాటు 20కి పైగా ూు ప్లాట్‌ఫామ్‌లకు యాక్సెస్ లభిస్తుంది.ఈ కొత్త ప్యాక్ ఒక నెల జియోహాట్‌స్టార్ యాక్సెస్‌ను అందించే ఎయిర్‌టెల్ ఇటీవలి రూ. 48 రీఛార్జ్ ప్యాక్‌ను అనుసరిస్తుంది. ఈ తాజా ఆఫర్, యూట్యూబ్ పెయిడ్ సబ్‌స్క్రిప్షన్‌ను అనేక స్ట్రీమింగ్ సేవలతో ఒకే రీఛార్జ్‌లో బండిల్ చేయడం ద్వారా విస్తృతమైన విధానాన్ని అవలంబిస్తుంది. అయినప్పటికీ ఇది సాధారణ ప్రీపెయిడ్ ప్లాన్‌కు ప్రత్యామ్నాయం కాదు.ఎయిర్‌టెల్ రూ. 200 టాప్-అప్ ప్యాక్ ప్రయోజనాలు:రూ. 200 ప్యాక్‌లో 30+దీ హై-స్పీడ్ డేటా, 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. దీని ప్రధాన ఆకర్షణ యూట్యూబ్ ప్రీమియం. ఇది వీడియోల నుండి యాడ్స్‌ను తొలగించి, బ్యాక్‌గ్రౌండ్ ప్లేబ్యాక్, ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్స్‌ను అందిస్తుంది. సబ్‌స్క్రైబర్‌లకు యూట్యూబ్ మ్యూజిక్ ప్రీమియం కూడా అందుబాటులో ఉంటుంది. ఈ ూు బండిల్‌లో ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్, జీ5 ప్రీమియం, సోనీలివ్‌లతో పాటు మరో 18కి పైగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు కూడా ఉన్నాయి. ప్రతి సర్వీస్‌కు విడివిడిగా డబ్బు చెల్లించే బదులు, యూట్యూబ్, పలు స్ట్రీమింగ్ యాప్‌ల మధ్య మారే వినియోగదారులకు ఈ ప్యాక్ ఉపయోగకరంగా ఉంటుంది.అయితే, ఇందులో ఒక ముఖ్యమైన మెలిక ఉంది. ఈ రూ. 200 రీఛార్జ్ అనేది ఒక ఎంటర్‌టైన్‌మెంట్ యాడ్-ఆన్ మాత్రమే. ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్ కాదు. దీనిలో కాలింగ్ లేదా ూమీ ప్రయోజనాలు ఉండవు. అందుకే దీనిని ఉపయోగించడానికి వినియోగదారులు తప్పనిసరిగా యాక్టివ్ ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ బేస్ ప్లాన్‌ను కలిగి ఉండాలి.రీఛార్జ్ చేసిన తర్వాత, వినియోగదారులు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ లేదా ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్‌ల వెబ్‌సైట్ ద్వారా యూట్యూబ్ ప్రీమియంను మాన్యువల్‌గా క్లెయిమ్ చేసుకోవాలి. వారు రివార్డ్స్, ూుం విభాగానికి వెళ్లి, యూట్యూబ్ ప్రీమియంను కనుగొని, క్లెయిమ్ ఆప్షన్‌ను ట్యాప్ చేయవచ్చు. ఈ సబ్‌స్క్రిప్షన్ ప్యాక్ 28 రోజుల వ్యాలిడిటీ వరకు ఉంటుంది. దీనిని ఉపయోగించడం కొనసాగించడానికి, వినియోగదారులు మళ్లీ రీఛార్జ్ చేసి, ఈ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవాలి.

అలాంటి మహిళలకు ఇదే నా వార్నింగ్.. ఆ ప్రవర్తన సరికాదు.. రామ్ చరణ్ సతీమణి ఉపాసన హెచ్చరిక..



యాంకర్ సుమ కనకాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఫెస్టివల్స్ ఫర్ జాయ్ 5వ వార్షికోత్సవ వేడుకలు మహిళా సాధికారత, ఐక్యతకు వేదికగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్మన్ ఉపాసన కొణిదెల ముఖ్య అతిథిగా హాజరై, స్ఫూర్తిదాయకమైన కామెంట్స్ చేశారు. వైజాగ్ నుండి వచ్చిన హైమ గారు ఉపాసనకు ప్రత్యేకమైన ఖాదీ చీరను బహుకరించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఉపాసన తన ప్రసంగాన్ని ప్రారంభించకముందు, కార్యక్రమ నిర్వాహకురాలు సుమ కనకాలకు కృతజ్ఞతలు తెలుపుతూ, "ఐయామ్ స్టక్ ఇన్ ఎక్సలెన్స్" అని సుమ అన్న మాటలను గుర్తు చేసుకున్నారు. సుమ కనకాల శక్తివంతమైన, ఆత్మవిశ్వాసం కలిగిన, విజయవంతమైన మహిళ అని ప్రశంసించారు. "ఆమెలో ఆత్మవిశ్వాసం ఆమె నుండే వచ్చింది, మనమంతా ఆమె నుండి స్ఫూర్తి పొందుతాము" అని ఉపాసన పేర్కొన్నారు. అనేక ఆడియో ఫంక్షన్లలో సుమ షోను ఎంత సమర్థవంతంగా నడిపిస్తారో, ఆమె ఎంత మంది హృదయ స్పందనలను ఎంత సునాయాసంగా నిర్వహిస్తారో ఆమె వివరించారు. అనంతరం, ఉపాసన తన కీలక సందేశాన్ని అందించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఒక లోతైన సమస్యను ఆమె ప్రస్తావించారు. కొందరు మహిళలు తమ సొంత విజయాల కోసం, లేదా బలహీనమైన పురుషుడిని ప్రసన్నం చేసుకోవడం కోసం ఇతర మహిళలను తొక్కేస్తున్నారని ఆమె హెచ్చరించారు. ఈ ప్రవర్తన సరికాదని, "ఒక మహిళ నొప్పి మరొక మహిళ విజయం కాకూడదు" అని అన్నారు.హిళలందరూ కలిసికట్టుగా ఉండాలని,పురుషుడిని ప్రసన్నం చేసుకోవడం కోసం ఇతర మహిళలను ఒకరికొకరు మద్దతునిచ్చుకుంటేనే పురోగమించగలరని ఉపాసన పిలుపునిచ్చారు. "మనం కలిసి ఎదగాలంటే, మనం కలిసి ఉండాలి, మన ఆలోచన "ఒక మహిళ నొప్పి మరొక మహిళ విజయం కాకూడదు" అని అన్నారు.హిళలందరూ కలిసికట్టుగా ఉండాలని, ఒకరికొకరు మద్దతునిచ్చుకుంటేనే పురోగమించగలరని ఉపాసన పిలుపునిచ్చారు. "మనం కలిసి ఎదగాలంటే, మనం కలిసి ఉండాలి, మన ఆలోచన విధానం మారాలి" అని ఆమె స్పష్టం చేశారు. స్వార్థం లేకుండా మహిళలను ప్రోత్సహించే వారితోనే తాను నిరంతరం ఉంటానని, అన్యాయం చేసిన వారికి కూడా మారడానికి, కోలుకోవడానికి ఒక అవకాశం ఇస్తానని ఉపాసన తెలిపారు. సానుకూల దృక్పథంతో, మహిళలు ఒకరినొకరు శక్తివంతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె చెప్పారు.

మాటలు రాని అమ్మాయి సినిమాల్లోకి..



సినిమా రంగంలో సక్సెస్ సాధించాలంటే అందం, అభినయం, హైట్ మాత్రమే కాదు.. ప్రతిభతో పాటు పట్టుదల, కష్టపడే తత్వం కూడా ఉండాలి. ఈ విషయాన్ని ఎంతోమంది నటీనటులు నిరూపించారు. అలాంటి వారిలో నటి అభినయ ఒకరు. పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్నప్పటికీ, తన అద్భుతమైన హావభావాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్నో సినిమాల్లో కీలక పాత్రలు పోషించి తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. అయితే అభినయ ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఆమె కష్టం మాత్రమే కాదు.. కుటుంబం అందించిన అండదండలు కూడా ఉన్నాయి. అభినయ జీవిత ప్రయాణం అంత సులభంగా సాగలేదు. చిన్నతనం నుంచే వినికిడి సమస్యను ఎదుర్కొన్న ఆమెకు కుటుంబమే అతిపెద్ద బలంగా నిలిచింది. ముఖ్యంగా ఆమె తండ్రి ఆనంద్.. కూతురిలోని ప్రతిభను గుర్తించి, ఆమెను సినీ పరిశ్రమకు పరిచయం చేయాలని నిర్ణయించుకున్నారు.అయితే వినికిడి, మాటల సమస్య ఉన్న అమ్మాయిని సినిమాల్లోకి తీసుకురావాలనే ఆలోచనను చాలామంది వ్యతిరేకించారు. ఆమెతో సినిమాలు చేయడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ఆనంద్ మాత్రం తన ప్రయత్నాలను ఆపలేదు. అభినయను నటిగా నిలబెట్టేందుకు ఆమె తండ్రి ఆనంద్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. కూతురిలోని ప్రతిభపై నమ్మకంతో అవకాశాల కోసం ప్రయత్నించారు. ఆమెకు సరైన పాత్రలు దక్కేలా కథల ఎంపిక నుంచి షూటింగ్ షెడ్యూళ్ల వరకు పలు విషయాల్లో సహకరించారు. మరోవైపు, అభినయ తల్లి కూడా ఆమె నటనకు అవసరమైన సన్నాహాల్లో కీలక పాత్ర పోషించారు.

అయితే వినికిడి, మాటల సమస్య ఉన్న అమ్మాయిని సినిమాల్లోకి తీసుకురావాలనే ఆలోచనను చాలామంది వ్యతిరేకించారు. ఆమెతో సినిమాలు చేయడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ఆనంద్ మాత్రం తన ప్రయత్నాలను ఆపలేదు.

మహేష్ బాబు వారణాసిలో మరో సర్‌ప్రైజ్..



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న వారణాసిపై రోజురోజుకూ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవలం తెలుగు ప్రేక్షకుల కోసమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో విపరీతమైన ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. రాజమౌళి గత చిత్రాలైన బాహుబలి, ఆర్ఆర్ఆర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. అయితే వారణాసి విషయంలో మాత్రం ఆయన మరింత భారీగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, ప్రపంచ నిర్మాణం ఇలా ప్రతి అంశంలోనూ కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నారని టాక్. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. వారణాసిలోని కొన్ని కీలక సన్నివేశాల కోసం ప్రత్యేకమైన భాషను, లిపిని రూపొందించినట్లు సమాచారం.కథలోని ఒక ప్రత్యేక ప్రపంచాన్ని మరింత సహజంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించేలా చూపించేందుకు ఈ కొత్త భాషను ఉపయోగించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి గతంలో బాహుబలి కోసం కిలికి అనే ప్రత్యేక భాషను సృష్టించిన విషయం తెలిసిందే. సినిమాలోని కల్పిత ప్రపంచానికి తగ్గట్టుగా ఆ భాషను రూపొందించడం అప్పట్లో ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు వారణాసి కోసం కూడా అలాంటి ప్రయోగమే చేస్తున్నారనే వార్త సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది.

దుమ్ము రేపు తున్న ప్రభాస్ ఫౌజీ గ్లింప్స్.



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాల కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. సాలార్ 2, కల్కి 2, ఫౌజీ, స్పిరిట్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. తాజగా ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఫౌజీ' చిత్ర గ్లింప్స్ (ఫైల్ నంబర్ 25) విడుదల చేశారు. 23న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో విడుదల చేసిన ఈ రెండున్నర నిమిషాల గ్లింప్స్, సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ గ్లింప్స్‌లో ప్రభాస్ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్లు ఒకెత్తయితే, వాటిని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నోటి ద్వారా చెప్పించడం మరొక ఎత్తు. హిట్లర్, సుభాష్ చంద్రబోస్ ఇద్దరూ కలిసి ఒక భారతీయ గూఢచారి గురించి చర్చించుకోవడం, ఆ గూఢచారే మన 'ఫౌజీ' అని చూపించడం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.గ్లింప్స్ ద్వారా దర్శకుడు కథ యొక్క నేపథ్యాన్ని చాలా ఆసక్తికరంగా పరిచయం చేశారు. గ్లింప్స్‌లోని హిట్లర్, సుభాష్ చంద్రబోస్ విజువల్స్ చాలా సహజంగా, అచ్చం నిజమైన నాయకుల్లా కనిపించడంతో చాలామంది ఇవి ఏఐ సాయంతో క్రియేట్ చేసిన పాత్రలని అనుకున్నారు. అయితే, ఇవి ఏఐ విజువల్స్ కావు, నిజమైన నటులే ఈ పాత్రల్లో జీవించారు. ముఖ్యంగా సుభాష్ చంద్రబోస్ పాత్రలో అచ్చుగుద్దినట్లు సరిపోయిన ఆ నటుడు ఎవరో తెలుసా.?ఆయన మరాఠి నటుడు సుభోద్ బావే. మరాఠీ చిత్ర పరిశ్రమలో సుభోద్ బావేకు విశేషమైన గుర్తింపు ఉంది. ఆయన కేవలం నటుడే కాదు... రచయిత, దర్శకుడు మరియు నిర్మాత కూడా.. నాటకాల నుంచి సినిమాల వరకు 1990ల కాలంలో నాటక రంగంతో తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించిన సుభోద్, 2002 నుంచి మరాఠీ, హిందీ చిత్రాల్లో నటించడం మొదలుపెట్టారు. కొంకణీ, మలయాళ భాషల్లోనూ మంచి పాత్రలు పోషించారు. కత్యర్ ఖల్జత్ గుసాలీ అనే సూపర్ హిట్ సినిమాతో ఆయన దర్శకుడిగా మారారు మారారు. 2015లో వచ్చిన 'లోక్‌మాన్య: ఏక్ యుగపురుష్' చిత్రంలో స్వాతంత్ర సమరయోధుడు బాలగంగాధర తిలక్ పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'ఫౌజీ' చిత్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్

బిగ్‌బాస్10లో ఊహించని ట్విస్టులు.. హౌస్ నుంచి ఆమె అవుట్.!



తెలుగు రియాలిటీ షో బిగ్‌బాస్ హౌస్ ఎప్పటికప్పుడు కొత్త మలుపులతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. గత వారం ఎలిమినేషన్ ప్రక్రియలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. అసలైతే షాలిని హౌస్ నుంచి బయటకు వెళ్లాల్సి ఉండగా.. బిగ్‌బాస్ ఆమెను సీక్రెట్ రూమ్‌కి పంపించారు. ఆ తర్వాత నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత షాలిని తిరిగి హౌస్‌లోకి తీసుకురావడంతో ఈ వారం ఆమె నామినేషన్ల నుంచి సేవ్ అయిపొయింది. షాలిని గత వారం ఎలిమినేట్ కాకపోవడంతో, ఈ వారం హౌస్‌లో డబుల్ ఎలిమినేషన్ ఉండే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. అందుకు తగ్గట్టుగానే మొదటి వికెట్ పడిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వారానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో పలువురు కంటెస్టెంట్లు ప్రమాదంలో చిక్కుకున్నారు.నామినేషన్లలో ఉన్న సభ్యులు: రోహిత్, త్రిగుణ్, రామకృష్ణ, అమన్, శ్వేత నాయుడు, వర్షిణి, వంశీ, సుధీర్, ఝాన్సీ, శివ, దక్షి, నీతూ మాస్టర్. హౌస్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'గోట్' టాస్క్‌లో గెలిచిన అమన్, త్రిగుణ్, ముకేశ్, దేబ్జానీ, నీతూ మాస్టర్‌లు ఈ వారంతో పాటు వచ్చే వారం కూడా నామినేషన్ల నుంచి పూర్తిగా సేవ్ అయ్యారు. అలరించడానికి వచ్చిన కంటెస్టెంట్లకు సంబంధించి తాజా ఓటింగ్ సరళి చూస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి. ఓటింగ్ పరంగా రోహిత్ మొదటి స్థానంలో దూసుకుపోతున్నట్లు తెలుస్తోంది. ఆయన తర్వాతి స్థానాల్లో త్రిగుణ్, రామకృష్ణ, అమన్, ఝాన్సీ, వర్షిణి, సుధీర్, వంశీ వరుస క్రమంలో కొనసాగుతున్నారు. ఇక

కోట్ల ఆస్తిపాస్తులున్న ఆటోలో తిరుగుతున్న స్టార్ హీరోయిన్..



సినీ తారల జీవితం అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది లగ్జరీ కార్లు, ఖరీదైన దుస్తులు, బ్రాండెడ్ వాచీలు, విలాసవంతమైన ఇళ్లు. వెండితెరపై తమ నటనతో ప్రేక్షకులను అలరించే సెలబ్రిటీలు నిజ జీవితంలోనూ ఎంతో విలాసంగా జీవిస్తుంటారని చాలామంది భావిస్తారు. అయితే కొందరు మాత్రం ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా సాధారణంగా ఉండటానికి ఇష్టపడతారు. ఓ స్టార్ హీరోయిన్ ఆటోలో ప్రయాణిస్తున్న వీడియో సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సెలబ్రిటీలు బయటకు వస్తే ఖరీదైన కార్లలో కనిపిస్తుంటారు. కానీ తాజాగా ఓ అందాల భామ మాత్రం ఆటోలో ప్రయాణిస్తూ కనిపించింది. దీంతో ఆమె వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరంటే.. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది ప్రేక్షకులకు సుపరిచితమైన రకుల్ ప్రీత్ సింగ్. రకుల్ ప్రీత్ సింగ్ తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.సాధారణంగా సెలబ్రిటీలు బయటకు వస్తే ఖరీదైన కార్లలో కనిపిస్తుంటారు. కానీ తాజాగా ఓ అందాల భామ మాత్రం ఆటోలో ప్రయాణిస్తూ కనిపించింది. దీంతో ఆమె వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరంటే.. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224